

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

శుక్రవారం 1, మార్చి 2024 | 8 పేజీలు

హంద్రీ-నీవా కాలువ నీటితో చెరువులను నింపాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు

విశాలాంధ్ర -బి.కొత్తకోట: హంద్రీ-నీవా కాలువల ద్వారా ప్రవహిస్తున్న నీటితో తంబళ్లపల్లె నియోజకవర్గం లోని అన్ని చెరువులు,కుంటలను నింపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు,జిల్లా కార్యవర్గ సభ్యు లు టి. కృష్ణప్ప లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారంస్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ అత్యంత కరువు కాటకాలతో ఉన్నటువంటి తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ప్రజలకు మరియు రైతాంగానికి సాగు- త్రాగునీరు కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన హంద్రీ-నీవా ప్రాజెక్టు కాలువల ద్వారా వస్తున్న నీటితో,రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజల ఇబ్బందులు పడకుండా అన్ని కుంటలు చెరువులను నింపాల్సిన అవసరం ఉందని అన్నారు.. మరీ ముఖ్యంగా బి.కొత్తకోట పట్టణానికి త్రాగునీటి కొరత లేకుండా ఉండాలంటే పట్టణానికి అనుకుని ఉన్న కానుగులకుంట,పెద్ద చెరువు,దేగాని చెరువులకు వెంటనే నీటిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్ మనోహర్ రెడ్డి మండల నాయకులు జి. రఘునాథ్,ఎం.అష్రఫ్ అలీ, ఎస్.జవహర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధలను...

పక్కాగా అమలు చేయాలి

ఎంసీసీ టాస్క్ ఫోర్స్ అధికారుల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ వి.విజయ్ రామరాజు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : రానున్న సాధారణ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబందలను పక్కాగా అమలు చేయలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు.. ఎంసీసి టాస్క్ ఫోర్స్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని స్పందన హాలులో త్వరలో జరగనున్న సాధారణ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతలో భాగంగా.. ఎంసీసీ అమలుపై టాస్క్ ఫోర్స్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు జేసీ గణేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై.. పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో జిల్లాలో జరిగిన ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్పూర్తితో ప్రస్తుతం జరిగే.. ఎన్నికలను కూడా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. నిర్దేశించిన తేదీల్లో ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని.. ఎన్నికల విధుల్లో భాగంగా.. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ విధులను టాస్క్ ఫోర్స్ అధికారులు పక్కాగా అమలు చేయాలన్నారు. 324 ఆర్టికల్ (కాంప్లిట్ కంట్రోల్ సూపర్విజన్) ప్రకారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎం.సి.సి.)ను అమలు చేయడం జరుగుతోందన్నారు. ఐపిసి సెక్షన్ 123 ద్వారా ఓటర్లను మభ్య పెట్టే.. ఎలాంటి చర్యలనైనా ఎంసీసీ నిబంధనల ఉల్లంఘన క్రింద పరిగణించాల్సి ఉంటుందన్నారు. డబ్బులు పంచినా,

-3లో

వైద్య రంగానికి వైసీపీ ప్రభుత్వం

అధిక ప్రాధాన్యత

ఎంపీ మిథున్ రెడ్డి

విశాలాంధ్ర-పీలేరు: దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాదాన్యత నిస్తూ పేదలకు మెరుగైన వైద్యసేవలంది స్తున్నారని లోక్ సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ మిథున్ రెడ్డిపేర్కొన్నారు. గురువారం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిని 50 నుంచి 100 పడకలకు పెంచుతూ నిర్మించిన నూతన భవన నిర్మాణాలను లోక్సభ ప్యా నల్ స్పీకర్, ఎంపీ మిథున్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, 24 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మిథున్ రెడ్డి మాట్లాడుతూరాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత నిస్తూ వైద్యు అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గతంలో రేషన్ కార్డు, పెన్షన్లు కావాలంటే ప్రజలు కార్యాలయాల చుట్టూ వాళ్లు అరిగేలా తిరిగేవారని నేడు సచివాలయ, వాలంటీర్ల, వ్యవస్థద్వారా సంక్షేమ పథకాలు పేదల ముంగిటకు చేరుతున్నాయన్నారు. గతంలో పీలేరు

-7లో

సమాజంలో వైద్యవృత్తి ఉన్నతమైంది

డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ కడప వైస్ ఛాన్సర్ డాక్టర్ బి. ఆంజనేయ ప్రసాద్

ఘనంగా 2018 బ్యాచ్ వైద్య విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-కడప: కడప నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆవరణంలో బాయ్స్ హాస్టల్ గ్రౌండ్ లో 2018 బ్యాచ్ సంబంధించిన గ్రాడ్యుయేషన్ డే ను గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ కడప వైస్ ఛాన్సర్ డాక్టర్ బి ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. వైద్య విద్యను పూర్తి చేసుకున్న తర్వాత రోగులను ఆప్యాయంగా పలకరించి వారు త్వరగా కోలుకునేలా సరైన వైద్యం అందించాలన్నది ప్రతి ఉన్నతాధికారి ,వైద్యుని ఆకాంక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి, కడప ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి .వి. రమాదేవి, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రాముడు, కడప క్యాన్సర్ కేర్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ కే .వాణి, వైద్యులు అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు..

జోరుగా గుట్కా చైనీ ఖైనీ విక్రయాలు

విశాలాంధ్ర-సుండుపల్లె : జోరుగా చైనీ ఖైనీ,గుట్కా, మీరాజ్, రాజా, తంబాకు వంటి విక్రయాలు చాపకింద నీరులా ప్రతినిత్యం దుకాణాల్లో దొరుకుతూనే ఉన్నాయి. ఆరోగ్యానికి హాని కలిగించేవిగా వీటిని ప్రభుత్వం నిషేధించినా ప్రతి దుకాణంలో (కిరాణా కొట్టు) చిన్నపాటి అంగళ్లలో రహస్యంగా అధికరేట్లకు విక్రయించి దుకాణదారులు సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు వ్యాపారులు మీరాజ్, రాజా, చైనీ ఖైనీ,వంటి విక్రయాలతో జేబులు నింపుకుంటున్నారు. 10 సంవత్సరాల పిల్లల నుండి యువకులు, వృద్ధుల వరకు గ్రామాలలోని దుకాణాలలోను పట్టణాల్లోను నిత్యం దొరుకుతూనే ఉన్నాయి.వీటికి బానిసలైన వారు ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు.రాజా, మీరాజ్,గుట్కా చైనీ ఖైనీ తదితర హానికర మైన ప్యాకెట్లను వినియోగించడం వలన గ్రామాలలో మహిళలు పొగాకు కట్టెలు నమలడంతో నోటి క్యాన్సర్ వస్తుందని ప్రభుత్వం ప్రతి సినిమా థియేటర్లలోనూ టీవీలల్లో సామాజిక మాధ్యమాల్లోనూ నోటి క్యాన్సర్ తో బాధపడుతున్న అటువంటి వ్యక్తులను చూపించినప్పటికీ పూర్తిగా మానివేయాలని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికి పక్క రాష్ట్రాలైన తమిళనాడు కర్నాటక రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుంటూ విక్రయాలు చాపకింద నీరులా చేరి ప్రతి గ్రామంలో మండల కేంద్రాలతోపాటు పట్టణాల్లో సైతం వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని చెప్పొచ్చు. అయితే ఇదే అదునుగా దుకాణదారులు వారికి ఇష్టమొచ్చిన రేట్లకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని రహస్యం గా గోడౌన్లలో నిల్వ చేసుకుని ఏజెం ట్లద్వారా దుకాణాల్లో విక్రయిస్తున్న ట్లు తెలుస్తుంది. వీటిపై పోలీసులు సోదాలు నిర్వహించక పోవడంతో దుకాణదారులు తమ ఇష్టారాజ్యంగా సొమ్ము చేసుకుంటు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్నారు. పోలీసులు దాడులు నిర్వహించి పూర్తిస్థాయిలో వీటిని నివారించాలని యువత ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని సంబంధిత అధికారులు, ప్రభుత్వం నిషేధించిన వాటిని పోలీసులు స్పందించి అరికట్టాలని యువత ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుకుందాం.ఈ వ్యాపారాన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తనిఖీలు కనిపించని ఆహార భద్రత చట్టం అధికారులు: సెక్షన్ 30(2) 2006 ఆహార భద్రతా చట్ట ప్రకారం రాష్ట్రంలో గుట్కా నిషేధం అమలులో ఉంది. వీటిని తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా, కఠిన చర్యలు తప్పవు ఇందుకు వైద్య, ఆరోగ్యశాఖ,పోలీస్ శాఖ,రవాణా శాఖ,కార్మికశాఖ, పురపాలక శాఖ, పంచాయతీరాజ్శాఖ,నిఘాశాఖ, వాణిజ్యశాఖ, పన్నుల శాఖల సమన్వయంతో తనిఖీలు చేయాలనే ఆదేశాలున్నాయి. నిషేదాన్ని అమలుచేసే బాధ్యత ఈ అన్ని శాఖలపై ఉన్నప్పటికీ జిల్లాలో తనిఖీలు మాత్రం జరగడం లేదు. ఒకవేళ జరిగిన నామ మాత్రమే.దీంతో నిషేధిత గుట్కా, చైనీ ఖైనీ, రాజా,వంటి మాఫియా చెలరేగి పోతోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం ప్రజలను ప్రమాదకరమైన వీటి బారి నుంచి కాపాడాలని కోరుకుందాం.

దళితుల కాలనీకి శ్మశానం కల్పించాలి:సిపిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గం చిట్వేల్ మండలంలోని సిపిఎం రాచపల్లి అలివేలు మంగాపురం దళితులకు శ్మశానం కల్పించాలి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య రెవిన్యూ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ చిట్వేల్ మండల కార్యదర్శి కేశం ప్రసాద్ అధ్యర్యంలో సిపిఎం రాచపల్లి అలివేలు మంగాపురం దళితులకు సంబంధించిన శ్మశాన వాటికను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. ఈ చిన్నయ్య మాట్లాడుతూ 40 కుటుంబాల వారు చాలా కాలంగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకుని రోజూ కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారన్నా రు. నాగవరం రెవిన్యూ సర్వే నెంబర్ 1028 లో ఒక ఏకరా 70 శెంట్లలో గ్రామ పెద్దల సహకారంతో శ్మశానంగా వాడుకుంటూ వచ్చారన్నారు. పెద్దల తదనంతరం పెద్దల మాటలను ఖాతరు చేయకుండా సదరు భూమిని అగ్రవర్ణాల వారు కబ్జా చేయడంతో శ్మశానం లేక దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తహశీల్దారు దృష్టికి తీసుకుపోయినా సర్వేయర్,విఆర్ఓ రావడం, పోవడం తప్ప శ్మశానాన్ని గుర్తించలేదన్నారు. ఇప్పటికైనా సంబందిత రెవెన్యూ అధికారులు స్పందించి దళితులకు శ్మశానం కల్పించి సహకరించాలన్నారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చిట్వేల్ తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి ఎరుకలయ్య,మందారపు రమేష్, మస్తాన్, దార్ల మణి, కోడూరు శంకరయ్య, కిరణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మానవత్వానికి ప్రతీక

విశాలాంధ్ర -బద్వేలు : రక్తదానం ప్రాణదానంతో సమానమని బిజీ వేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకట సుబ్బారెడ్డి తెలిపారు .రెడ్ రిబ్బన్ క్లబ్, కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగం సంయుక్తంగా ఏర్పాటుచేసిన రక్తదా న శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణాలను కాపాడినవారమవుతామని, ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు సమయానికి రక్తము అందక ఎంతోమంది ప్రాణాలు విడుస్తున్నారని, ఇలాంటి వారికి ప్రాణాలు నిలబెట్టేందుకు రక్తదానం చేయవలసినటువంటి ఆవశ్యకత యువత పై ఉందని గుర్తు చేశారు.ఈ శిబిరంలో 50 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగింది. కార్యక్రమంలో కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ మరియు ఎన్.ఎస్.ఎస్ సమన్వయకర్తలు డాక్టర్ ఎమ్.దొరస్వామి నాయక్ ,సి.హెచ్.ఈశ్వరయ్య, ఇ.మహేశ్ ,స్పెషల్ ఆఫీసర్ శివశంకర్ రెడ్డి, రెడ్ రిబ్బన్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ సుధాకర్, మెడికల్ ఆఫీసర్ యశస్వి రెడ్డి, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ స్వరూప కళాశాల అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బంది, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

విశాలాంధ్ర - చెన్నూరు : కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలను వైకాపా ప్రభుత్వం చేస్తున్నట్టు ప్రచారం చేస్తున్నారని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు వంగల శశిభూషణ్ రెడ్డి అన్నారు. మండల అధ్యక్షులు గాడి భాస్కర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం కింద అంగన్వాడి సరుకులు 5000, చనుబాలు ఇవ్వడం సమయంలో నిర్దిష్ట పౌష్టికా హారం కింద 6000, పీఎం ఆవాస్ యోజన పథకం (అర్బన్) కింద ప్రతి పేదవాడు ఇంటి నిర్మాణం కోసం 1,80,000 ఇవ్వడం జరుగుతుంది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద 6000 రూపాయలు, ఉజ్వల యోజన పథకం కింద 31.5 కోట్ల మందికి ఎల్పిజి గ్యాస్ కనెక్షన్లు, 26 కోట్లకు పైగా ఆయుష్మాన్ కార్డులు మంజూరు చేయడం జరిగింది. మేక్ ఇన్ ఇండియాతో మెట్రో రైలు,దేశంలో 20 నగరాలలో 878మెట్రో నెట్వర్క్ వినియోగంలో ఉంది. 80 కోట్ల మందికి ఆహార భద్రత కింద ప్రతినెలా ఉచిత బియ్యం అందించబడుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శశిభూషణ్ రెడ్డి,లక్ష్మీనారాయణ, గాలి హరిప్రసాద్, శ్రీనాథ్రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి,భరత్ రెడ్డి, ప్రతాప్రెడ్డి రామసుబ్బయ్య ముకుందరెడ్డి, అధికారి రవి శివారెడ్డి, గోదిన గంగాధర్, కాశి తదితరులు పాల్గొన్నారు.

విద్య వైజ్ఞానిక సంబరాల్లో జూనియర్ సివిల్ జడ్జి

విశాలాంధ్ర- సిద్ధవటం : ఉమ్మడి కడప జిల్లా సిద్ధవటం నలంద స్కూల్ నందు విద్య వైజ్ఞానిక సంబరాల్లో భాగంగా సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీనివాస కళ్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్కూల్ యాజమాన్యం ఘన స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్ మాట్లాడుతూ సైన్స్ పట్ల,చట్టాల పట్ల ప్రతి విద్యార్థి, విద్యార్థినిలు అవగాహన కలిగి ఉండాలని క్రమశిక్షణకు మారుపేరుగా ఉన్న నలంద స్కూల్లో ఎంతో నైపుణ్యంతో విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేయడం సైన్స్ పట్ల అవగాహన కలిగే విధంగా యాజమాన్యం ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు రాష్ట్ర జిల్లా స్థాయి లో ఎన్నో బహుమతులు రాణించడంలో,విద్యార్థుల పట్టుదల, కృషి మరువ లేనిదని తెలియజేశారు. శాస్త్రీయ అవగాహన సృజనా త్మకత శక్తిని వెలికి తీయడానికి సైన్స్ సంబరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశా రు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన ఉండాలని విద్యార్థుల కు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా సైన్స్ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య, కరస్పాం డెంట్, బాలుగారి వెంకటసుబ్బయ్య, డైరెక్టర్ రాజశేఖ ర్ రెడ్డి, అడ్మిషన్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, స్కూల్ ఇంచార్జ్, గాగేశ్వరి,హెడ్ కానిస్టేబుల్ రాజు, విద్యార్థు ల తల్లిదండ్రులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం విజయవంతం

విశాలాంధ్ర - వీరబల్లి : సంతానలేమితో బాధపడుతున్న 23 మంది దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చి సలహాలు మరియు సూచనలు ఇచ్చినట్లు ప్రముఖ ఐవిఎఫ్ స్పెషలిస్ట్ డా.వై.ప్రమోద తెలిపారు. గురువారం వీరబల్లి లోని ఎస్వీకేఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ ఆధ్వర్యంలో వీఆర్డీఎస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరం విజయవం తం గా ముగిసింది.ప్రముఖ ఐవిఎఫ్ స్పెషలిస్ట్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ వై.ప్రమోద శిబిరానికి విచ్చేసిన వారందరిని ఉచితంగా పరీక్షించి, కౌన్సిలింగ్ ఇచ్చారు.అనంతరం డాక్టర్ మాట్లాడుతూ సంతానలేమి కారణం స్త్రీ ,పురుషులు ఇద్దరు కావచ్చు అని తెలిపారు. ఇద్దరిని పరీక్షించాకే ఒక నిర్ణయానికి రావచ్చని చెప్పారు. మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ లో అత్యధిక వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐవిఎఫ్, ఐయుఐ, ఐసిఎస్ఐ, ఎరా తదితర అన్ని రకాల అత్యధిక వసతి సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. ఈ శిబిరానికి విచ్చేసిన వారందరికీ 30 రోజులు ఆసుపత్రిలో డాక్టర్ కన్సల్టేషన్ ఉచితమన్నారు. ప్రతి మంగళవారం మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ లో కూడా ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరానికి విచ్చేసిన వారందరికీ అవసరమైన మందు లను ఉచితంగా పంపిణీ చేశారు. బిపి, బరువు, శ్యాచురేషన్ పరీక్షించారు .వీఆర్డీఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతు మారు మూల ప్రాంతాల్లో డాక్టర్ ప్రమోద గారు ఇలాంటి శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందదగ్గ విషియమన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్వీకేఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల డైరెక్టర్ డి. రవిశేఖర్ రెడ్డి, సిబ్బంది గీత,అంజలి, మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ జనరల్ మేనేజర్ ఎస్.వనజ, సిబ్బంది పవన్, శీను, తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి: చైర్మన్

విశాలాంధ్ర-పులివెందుల: ఈ నెలలో మూడో తేదీన నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ కోరారు. స్థానిక మునిసిపల్ ఆఫీస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు ఆశా కార్యకర్తలు వాలంటీర్లకు పల్స్ పోలియోపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ వరప్రసాద్ గారు మాట్లాడుతూ మూడవ తేదీన జరగబోయే కార్యక్రమంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదు సంవత్సరముల వయసులోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే పోలియో రహిత సమాజాన్ని నిర్మించడానికి మీరందరూ కృషి చేయాలని కోరారు. పోలియో రోజు పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఉదయం పూట టిఫను మరియు మధ్యాహ్నం భోజన ఏర్పాటు ను కల్పిస్తున్నట్టు తెలిపారు. శానిటరీ ఇన్స్పెక్టర్ మురళి మాట్లాడుతూ అందరూ కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకు అన్ని విధాల పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తదుపరి ఎం పి హెచ్ ఈ ఓ సతీష్ కుమార్ మాట్లాడుతూ వ్యాక్సినేటర్లు చేయవలసిన విధులు గృహ సందర్శనములో చేయు కార్యక్రమంలో గృహ సందర్శనములో పల్స్ పోలియో విధి విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమ ంలో కౌన్సిలర్ కిషోర్ ,డాక్టర్ లిఖిత ,డాక్టర్ శాంతి కుమార్ డాక్టర్ బాలాజీ ,ఎంపిహెచ్ఈఓ సతీష్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

లింగాలలో:

లింగాలలో: ఈ నెల 3,4వ తేదీలలో జరుగబోయే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి సుభాషిణి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఈ అంశంపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొత్తం 3599 మంది చిన్నారులను పోలియో చుక్కలకు అర్హులుగా గుర్తించామన్నారు. మూడు రూట్ల ద్వారా 32 కేంద్రాలలో పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, సీహెచ్వో శివరామ్, సూపర్‌వైజర్లు కుసుమకుమారి, ఆయిసా బేగం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్అదాలత్ కార్యక్రమంలో మార్పు

విశాలాంధ్ర - కమలాపురం : ఈనెల 9వ తేదీన జరగవలసిన జాతీయ లోక్ అదాలత్ మహాశివరాత్రి ప్రభుత్వం సెలవు దినాల కారణంగా మార్చి 16వ తేదీకి మార్చబడుతున్నట్లు కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య ఓ ప్రకటన తెలియజేస్తూ ప్రభుత్వ సెలవు కారణంగా కోర్టు అధికారులు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెజిస్ట్రేట్ అందులో పేర్కొన్నారు. కక్షిదారులు ఈ విషయాన్ని గమనించి 16వ తేదీన జరిగే లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని మెజిస్ట్రేట్ తెలిపారు.

ఎలక్ట్రికల్ షాప్ ప్రారంభం

విశాలాంధ్ర - కమలాపురం : స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలో నూతనంగా నిర్మించిన భవనాలలో గిద్దలూరు రాఘవేంద్ర యజమాని ఆహ్వానం మేరకు తెలుగుదేశం యువ నాయకులు పుత్తా లక్ష్మిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ దుకాణాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. యువ నాయకుడు మాట్లాడుతూ మీ రాఘవేంద్ర ఎలక్ట్రికల్ లాభాల దిశలో ఉండాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనాధ శవానికి అంత్యక్రియలు

విశాలాంధ్ర-గాలివీడు: మండల కేంద్రంలోని చిలకలూరిపేటలో మృతి చెందిన అంజనమ్మ అనే అనాధ మహిళకు స్థానిక యువకులు అంత్యక్రియలు నిర్వహించారు.మృతురాలు అంజనమ్మ అనాధ కావడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో స్థానికులు సేవాభావం స్వచ్ఛంద సంస్థకు సమాచారం ఇవ్వడంతో ఆసంస్థ సభ్యులు,స్థానికులతో కలసి తమ సొంత నిధులతో అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.అనాధ శవం అంత్యక్రియల్లో మానవత్వాన్ని ప్రదర్శించిన యువకులను పలువురు అభినందించారు. ఈకార్యక్రమంలో ఆర్యశంకర్,కరుణాకర్ రెడ్డి,రవి, రెడ్డప్ప రెడ్డి,శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని వైకోడూరు గ్రామ మాజీ సర్పంచ్ సిరిగిరెడ్డి శివారెడ్డి భార్య దివంగత మాజీ సర్పంచ్ సునంద పెద్దకర్మను పురస్కరించుకొని గురువారం స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో గల ఆశ్రమంలో నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరాశ్రయులు దివంగత సునంద ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు.

హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై కళాజాత

విశాలాంధ్ర-పులివెందుల: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంల పులివెందుల పట్టణం లోని పూల అంగళ్ళ కూడలి, పార్నపల్లి బస్టాండ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణల లో హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, చికిత్స ల పైన పాటలు, నాటిక, నృత్య రూపాలలో రాయలసీమ జానపద కళాకారుల కళాజాత బృందం గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు,పి ఆర్ ఓ బాలనారా యణ,ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, ఎస్ టిడి కౌన్సిలర్ బాదల్ వలి, సీడీఎస్ మేనేజర్ టోపీ వల్లి,స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సభ్యులు,సీడీ ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5వ సారి రక్త దానం చేసిన యువకుడు

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: పోరుమామిళ్ల గ్రామం గిరినగర్కు చెందిన బాలమ్మ అను వృద్ధ మహిళకు రక్త హీనతతో పోరుమామిల్లలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ నందు చేరగా హాస్పిటల్ వైద్యసిబ్బంది ఏ, బి పాజిటివ్ రక్తం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా తెలుపగా పేషెంట్ తాలూకా బంధుమిత్రులు రక్తం కోసం ప్రయత్నం చేయగా చివరి క్షణాల్లో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ ను ఆశ్రయించగా ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్ రసూల్ స్పందించగా శ్రీ కాశీనాయన మండలం మిద్దెల గ్రామానికి చెందిన గుమ్మగాళ్ల వెంకట రమణచే 5వ సారి అత్యవసరంగా రక్త దానం చేపించారు.ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ రసూల్ ప్రసాద్లు అడిగిన వెంటనే రక్త దానం చేసినదుకు అభినందిస్తు రక్తదానం చేయాలనే ఉత్సాహవంతులు దయచేసి స్వచ్ఛంద సేవకులు మాలాంటి స్వచ్ఛంద సేవా సంస్థలకు చేయూతనిచ్చి అత్యవసర పరిస్థితిలో రక్తమందక కొట్టుమిట్టలాడుతున్న రోగుల ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఎవరికైనా అత్యవసరంగా రక్తం కావాలనుకుంటే 8125991900, వాట్స్ అప్ నంబర్ కి మెసేజ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సర్వేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బద్వేల్ డివిజన్ చైర్మన్ చాటకొండా సురేష్ పాల్గొన్నారు.

జెండాలు జత కట్టడమే ప్రతిపక్ష నేతలు అజెండా

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: పేద ప్రజల గుండెల్లో సంక్షేమ గుడి కట్టడమే జగన్ ఎజెండా అని ఎన్నికలకు సిద్ధం అంటూ ప్రచారయాత్రను నాలుగో రోజు బద్వేల్ నియోజకవర్గంలోని పోరుమామిళ్ల టౌన్లో హుస్సేన్పీరా దర్గాల ప్రత్యేక పూజులు చేసి, ఒకటో వార్డులోని కాపు వీధి, రామాయణపు వీధి, పలు వీధుల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డి సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ మాట్లాడుతూ ప్రతీ నెల 1వ తేదీన పెన్షన్లు రూపంలో అవ్వ తాతలు కుటుంబాల్లో సంతోషాల వెలుగును తెస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో తామంతా కలిసికట్టుగా గెలిపించేందుకు కృషి చేయాలని వారు కోరారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ నూటికి నూరు శాతం సంక్షేమ పథకాలు అందించేందుకు ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే పేద ప్రజల పక్షాన నిలబడి ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు మంచికి చెడుకు మధ్య జరుగుతున్న యుద్ధం అని ఈ యుద్ధానికి బద్వేల నియోజకవర్గ పరిధిలోని ప్రజలతో సిద్ధంగా ఉండాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేని ముందు కంటే అధిక మెజారిటీ తో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ యువ నాయకులు దేవసేన ఆదిత్య రెడ్డి, చిత్తా విజయప్రతాప్రెడ్డి, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్రెడ్డి, బేకూరిపేట సర్పంచ్ రమణారెడ్డి, సి.బాష, అల్లా, రాజీవ్బాష, రవికుమార్, మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సీతారామ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

విశాలాంధ్ర-రామాపురం: మండలంలోని కసిరెడ్డి గారి పల్లి పంచాయతీ కొత్తపల్లి నందు గ్రామస్తులు తమ సొంత నిధులతో రూ 50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో గురువారం శ్రీ మహ గణపతి. సుబ్రహ్మణ్యేశ్వర. హనుమాన్. సామెత శ్రీ సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహకులు. ప్రజలు తెలిపారు.ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు మాట్లాడుతూ గత మూడు రోజుల పాటు వేద పండితులచే ఆలయంలో వివిధ రకాలైన గురువారం ఉదయం నుంచి ప్రాత: కలపూజా .ప్రతిష్ట హెూమం. శాంతి పౌష్టిక హెూమాలు. గర్త పూజ. మేష లగ్న పుష్య రాశమున నందు యంత్ర ప్రతిష్ట .తదుపరి విగ్రహ ప్రతిష్ట. శిఖర కలశ ప్రతిష్ట. భింబ కళాన్యాసము. పూర్ణాహుతి. శిఖర కుంభాభిషేకం. తదుపరి స్వామి సర్వదర్శనం తదుపరి సీతారామ కళ్యాణోత్సవం తీర్థ ప్రసాద్ వినియోగములు వచ్చిన భక్తులకు మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు రాత్రికి పలు రకాల మూడు రోజులు పాటు రకాల సంస్కృతి కార్యక్రమాలతో పాటు పూజలు భజనలు చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాలి బాలిసెట్టి చంద్రమౌళి. రేఖం నారాయణ. ఆంజనేయులు. బండారు తిమ్మారెడ్డి. సానే రమేష్. ఎస్ కృష్ణయ్య. బాలకృష్ణ. దర్గ సుబ్బరాయుడు. నందెం రామసుబ్బారెడ్డి. బండారు బాబు. మద్రాసు రాజా. బండారు శ్రీకాంత్. వీరి దంపతులతో స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులచే కల్యాణోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోనే ప్రజలు కాకుండా ఇతర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు మహిళలు భక్తులు హాజరయ్యారు కార్యనిర్వాహకులు తెలిపారు.

వైస్ చైర్మెన్ ఖాజా అధ్యక్షతన మున్సిపల్ సమావేశం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మున్సిపల్ వైస్ చైర్మెన్ సీఎస్ ఖాజా అధ్యక్షతన మున్సిపల్ అత్యవసర సమావేశం కౌన్సిల్ సభా భవనంలో జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ బంగారురెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో 90మందిని పారిశుధ్య కార్మికులను తీసుకోవడం జరిగిందని, వారి పని తీరు బాగుం దన్నారు. వారికిచ్చే జీతము రూ.12వేలు సరిపోదని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని రూ.3వేలు పెంచి రూ.15వేలు ఇస్తే బాగుంటుందని ఆ దిశగా ఎమ్మెల్యే మరియు అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. అందుకు ఎమ్మెల్యే పారిశుద్ధ్య కార్మికు లు 90మందికి రూ.15వేలు పెంచడం మంచిదే అని ఆ దిశగా ఉన్నతాధికారులకు తెలియజేసి పెంచే మార్గం చూడాలని అధికారులకు ఆదే శించారు. కమీషనర్ స్పందిం చి మాట్లాడుతూ తాము గతంలో పనిచేసిన మున్సి పాల్టీలో రూ.15 వేలు ఇచ్చామని ఆ జీఓ ప్రతులను తెప్పించు కొని వారికి జీతం పెంచే మార్గము చూస్తామని తెలిపారు. 15వ వార్డు కౌన్సిలర్ ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ స్థానిక మైదుకూరు రోడ్డు టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఆర్టీసి బస్టాండు వరకు కాలువను ఏర్పాటు చేయాల న్నారు. అలాగే స్మార్ట్ సిటీగా తయారు చేశామని ఫుట్పాత్ చేశాము, ఫుట్ పాత్ కింద మురుగు పెరిగిపోయిందని వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు కావాలసిన మౌళిక సదుపా యాలు ఏమైనా ఉన్నా వాటికి సంబంధించి త్వరగా టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

చైర్మెన్ హెూదాను కల్పించడం హర్షనీయం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మెన్కు చైర్మెన్ హెూదా కల్పించి సమావేశము నిర్వహించడం హర్షనీయం అని కౌన్సిలర్లు జీలాని, కమాల్‌బాష, గౌస్, ఇబ్రహీం ఖలీలుల్లాలు పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ చైర్మెన్ ఛాంబర్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి ముస్లిం, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించడం హర్షనీయం అన్నారు. గురువారం జరిగిన మున్సిపల్ అత్యవసర సమావేశము వైస్‌చైర్మెన్ ఖాజా అధ్యక్షతన జరగడం పట్ల ఎమ్మెల్యే ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేయడమే అన్నారు.

.. పక్కాగా అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి) తీసుకున్నా నేరం క్రింద కేసు చేయవచ్చున్నారు. అలాగే లిక్కర్ పంపిణీ, చీరెలు, ఇతర కానుకల పంపిణీ జరగకుండా చూడాలన్నారు. అలాగే.. పార్టీలకు సంబంధించిన లోగోలు, జెండాలు, బ్యానర్లు అనుమతి లేకుండా ప్రదర్శించడానికి వీలులేదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు.. ప్రచార సమయం, పబ్లిసిటీ లౌడ్ స్పీకర్లకు అనుమతులివ్వాల్సి ఉంటుందన్నా రు. ఎక్కడా కూడా రాజకీయ ప్రభావాన్ని చూపే వ్యక్తుల విగ్రహాలు బహిర్గతం కాకుండా.. మూసి వేయాలన్నారు. ఫ్లెక్సి ప్రింటర్స్ వివరాలు లేకుండా ప్రచార బ్యానర్లు ముద్రిస్తే.. చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సీజర్ మేనేజ్మెంట్ పై అవగాహన పెంచుకుని.. ఎన్నికల నిర్వహణ నియమావళిని పక్కాగా పాటించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా ప్రతినిధుల ఫోటోలను తొలగించాలని, రాజకీయ నేతల విగ్రహాలను కప్పి ఉంచాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగానే.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని ప్రభుత్వ అధికారులందరూ ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని ఆదేశించారు. ముఖ్యంగా రిలీజియస్ (దేవాలయాలు, మజీద్ లు, చర్చీలు) ప్రాంతాల్లో ఎలాంటి రాజకీయ సమావేశాలకు తావివ్వకుండా చేసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక సూచనల మేరకు.. ఎన్నికల మోడల్ కోడ్ నియమావళిని తూచా తప్పక అందరూ పాటిస్తూనే.. మున్సిపాలిటీల్లో, మండలాల్లో ప్రజలకు తాగునీరు, పారిశుధ్య నిర్వహణలో ఏ మాత్రం కొరత రాకూడదని హెచ్చరించారు. ఫ్లెక్సీ ప్రింటర్స్, లోకల్ మీడియా పర్సన్స్తో, స్థానిక పొలిటికల్ పర్సన్స్ లతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు, నిబంధనలపై తెలియ జేయాల న్నారు. అంతకుముందు కడప నగర కమీషనర్ ప్రవీణ్ చంద్.. టాస్క్ ఫోర్స్ అధికారులకు ఎంసీసీ నిబంధనలు, విధివిధానాలపై క్షుణ్ణంగా వివరించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈవో సుధాకర్ రెడ్డి, ఎంసీసీ నోడల్ అధికారి నందన్, జిల్లా మాస్టర్ ట్రైనర్ మెప్మా పిడి సురేష్ రెడ్డి, హాజరయ్యారు.

మేలు జరిగిఉంటేనే ఆదరించండి:ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మీకు, మీ కుటుంబానికి మేలు జరిగిఉంటేనే ఆదరించి ఓటు వేయాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 14వ రోజు మున్సిపల్ పరిధిలోని 25వ వార్డులో కౌన్సిలర్ షేక్ మాహనూర్, ఇంచార్జ్ షేక్ నూరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాచమల్లు, సతీమణి రాచమల్లు రమాదేవిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారికి వార్డులోని మైనార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. తమ ప్రభుత్వంలో ముస్లిం, మైనార్టీలకు పెద్దపీట వేశామని అన్నారు. బీజేపీ మత తత్వ పార్టీ అని పేర్కొన్నారు. అ కార్యక్రమంలో వార్డు వైకాపా నాయకులు కరీముల్లా, ఇస్మాయిల్, అల్లాబకాష్, మహబుబ్ బాష, ఇర్ఫాన్, ఫారుక్, బాబురావు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పేరుతో పేదలను అప్పులపాలు చేసిన జగన్ రెడ్డి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఇళ్ల పేరుతో జగన్ రెడ్డి పేదలను నిలువునా అప్పుల పాలు చేశారని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం టిడిపి ప్రధాన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి 5 లక్షల చొప్పున మొత్తం 25 లక్షల ఇళ్లు నిర్మించి యిస్తానని హామీ ఇచ్చి జగన్ రెడ్డి పేదలను మోసం చేశారని విమర్శించారు. ఇళ్ల పేరుతో డ్వాక్రా మహిళల ఒక్కొక్కరి పేరుతో 35 వేల చొప్పున మొత్తం 3,866 కోట్లు అప్పులు తెచ్చి మహిళల పైన మోయలేని భారం మోపారన్నారు. టిడ్కో ఇళ్లను జగన్ రెడ్డి తాకట్టు పెట్టి 10 వేల కోట్లు అప్పులు తెచ్చి ఆ అప్పు చెల్లించక పోవడంతో బ్యాంకు అధికారులు నేరుగా లబ్ధిదారులకే నోటీసులు ఇచ్చే దుస్థితికి తెచ్చారని విమర్శించారు. తెచ్చిన అప్పులు ఏమయ్యాయని ఎవరి జేబుల్లోకి మళ్లించారని విమర్శించారు.ఈ సమావేశంలో టిడిపి నాయకులు పులెల రమేష్ బాబు, గడికోట సుబ్బరాయుడు, నగిరిపాటి రేవతి, కస్తూరి నాగరాజాచౌదరి, తాడి చిన్నయ్య, తేనేపల్లి చిన్న, బోనాసి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణే ధ్యేయం

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో... కడప నగరాన్ని అత్యంత పరిశుభ్రంగా, సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంలో ముందడుగులో ఉన్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా పేర్కొన్నారు. గురువారం నగరంలోని 11వ డివిజన్ లోని వై. జంక్షన్, అంబేద్కర్ భవన్ వద్ద, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు లోని జాకీ షోరూం ప్రాంతాల్లో కార్పొరేషన్ జనరల్ ఫండ్ ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు.. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా 11వ డివిజన్ కార్పొరేటర్, ఇంఛార్జీలు భాస్కర్ వర్మ లతో కలిసి.. శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జిల్లాలో కుంటుపడిన అభివృద్ధి పనులన్నీ.. మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో పునరుద్ధరణకు నోచుకుంటున్నాయన్నారు. ఆయన పాలనలో కడప జిల్లాతో పాటు కడప నగరం మరింత అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. ప్రత్యేకించి కడప నగరాన్ని సుందర నగరంగా, పరిశుభ్రంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా 11వ డివిజన్ లో అభివృద్ధి పనులను ఈ రోజు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే కడప నగరంలోని అన్ని ప్రధాన కూడళ్ళు, ప్రధాన రోడ్లు, పార్కుల అభివృద్ధి తో పాటు అన్ని డివిజన్లలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు షఫీ కిరణ్ సుబ్బారెడ్డి ఈటె.రామచంద్రయ్య కాంట్రాక్టర్లు నిరంజన్ రెడ్డి సురేష్ రెడ్డి, మైనార్టీ నాయకులు, స్థానిక వైసీపీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడిన నేత శివారెడ్డి

విశాలాంధ్ర-కడప : ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడిన ఉద్యోగ నేత శివారెడ్డి అని కడప జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు బి. శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ యాదవ్‌లు పేర్కొన్నారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా శివారెడ్డి ఎంపికైన సందర్భంగా వీరు ఒక ప్రకటనలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివారెడ్డి 1985 ఏప్రిల్ 27న ఉద్యోగంలో చేరినప్పటి నుండి కడపలో ఉద్యోగుల సమస్యలపై అధికారులతో ప్రభుత్వంతో నిరంతరం పోరాడుతూ ఏపీ ఎన్జీవో సంఘ సంఘంలో అనేక పదవులు చేపట్టారన్నారు. కోశాధికారిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేసిన ఆయన కడప జిల్లా అధ్యక్షులుగా 12 సంవత్సరాల పాటు ఉద్యోగులకు సేవలు అందించాలని మాట్లాడారు. 2021 జులై లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి ఉద్యోగులకు అనేక సేవలందించాలని అన్నారు. ప్రస్తుతం గురువారం రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన మా మిత్రుడు సోదర సమానులు కె.వి శివారెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నామని అన్నారు. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చౌదరి పురుషోత్తం నాయుడు, సహ అధ్యక్షులు పి.దస్తగిరిరెడ్డి, ఉపాధ్యక్షుడు. వెంకటేశ్వర్లుకు కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: విజ్ఞాన శాస్త్ర ప్రగతి లోనే సమాజాభివృద్ధి జరుగు తుందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అనంత పద్మనాభ మూర్తి తెలిపారు. బుధవారం ఉతయం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ సుబ్బరామయ్య మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు మాట్లాడుతూ శాస్త్రవేత్తల ఆవిష్కరణల తోనే నేటి సమాజం సౌకర్యాలను అనుభవిస్తున్నదని, వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటి విద్యార్థులు శాస్త్రీయ భావాలను పెంపొపందించుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాల న్నారు. సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమామహేశ్వర, గురురత్నం, ప్రవీణ్, శ్రీనివాసులు, అశోక్‌కుమార్, బసిరెడ్డి ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర – సుండుపల్లె : మండలం లోని పెద్దినేని కాలువ గ్రామపంచాయతీ చెరుకువాండ్లపల్లెలో శుక్రవారం అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు హోమం అభిషేకం నిర్వహించి అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్టను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ తోపాటు మండల నలుమూలల నుండి భక్తులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్ రెడ్డి విమర్శించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీలో 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. 11వ పీఆర్సీ బకాయిల ను వాయిదాల పద్ధతిలో కాకుండా ఏక మొత్తంలో చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు విడతల డీఏలను తక్షణమే ప్రకటించాలని అన్నారు. పీఎఫ్, ఏపిజీయల్ఐ, ఋణాలను చివరి మొత్తాలను చెల్లించాలని తెలిపారు. సరెండర్ లీవు బిల్లులను, మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలని, సీపీఎఫ్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యా పెన్షనర్లకు 33వేల కోట్ల రూపాయల బకాయి లు చెల్లించాల న్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాం టం పెన్షన్‌ను 70 నుంచి 75సం వత్సరాల మధ్య వారికి 10 శాతం, 80 నుండి 85సంవత్సరాల మధ్య వారికి 15శాతంకి పెంపుదల చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల మీద ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమాన్నిఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు రమేష్‌రెడ్డి, అప్సర్ బాష, ప్రొద్దుటూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరసింహకుమార్, చాపాడు మండల అధ్యక్ష కార్యదర్శులు రాజారెడ్డి, మల్లికార్జున, దువ్వూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండారెడ్డి, నారాయణరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు బాబుల్‌రెడ్డి, అమీను, ఖాజాపీర్, వరప్రసాద్‌రెడ్డిలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : గురువారం కడప నగరంలోని కలెక్టర్ ఆఫీస్ దగ్గర మహా ధర్నా నిర్వహించారు. అనంతరం కడప జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, మాట్లాడుతూ 2019లో వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మనకు వచ్చే పథకాలు మెటర్నటీ (ప్రసవం) బెనిఫిట్ 20 వేలు, కార్డు వున్న కార్మికుడు సాధారణ మరం చెందితే 80 వేలు, పని ప్రదేశంలో యాక్సిడెంట్ జరిగి మరిణిస్తే 5 లక్షలు, అంగవైకల్యం చెందితే 2 లక్షల వరకు వచ్చేది. కార్డు వున్న కార్మికుని అమ్మాయికి పెళ్లి జరిగితే పెళ్లికానుక 50 వేల నుండి ఒక లక్ష వరకు వచ్చేది. ప్రక్క రాష్ట్రాలలో ప్రతి పండుగకు 3 వేల రూపాయలు యిస్తున్నారు. మన రాష్ట్రంలో యివ్వడంలేదు. ప్రతి భవన నిర్మాణ కార్మికుని పిల్లలకు స్కాలర్షిప్ 5 వేల నుండి 50 వేల వరకు యిస్తున్నారు. మన రాష్ట్రంలో యివ్వడంలేదు. 2019లో వై.యస్. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే ఆయన చల్లని చూపు మనపై పడింది. నవరత్నాల పేరుతో యివన్నీ తొలగించి కార్మికులను మోసం చేస్తున్నాడు. ఇసుక పాలసీ అంటూ ఇసుక వ్యాపారం మొదలు పెట్టి ఇసుక కొరత సృష్టించి మనకు పనులు లేకుండా చేసి రాష్ట్రంలో 32 మంది భవన నిర్మాణ కార్మికుల ఆకలి చావులకు, అప్పుల చావులకు కారకుడైనాడు. అంతటితో మనపై కసి తీరక మన సంక్షేమ బోర్డుపై ఆయన దృష్టి పడింది. బోర్డులోని నిధులను విడతల వారీగా 16 వందల కోట్ల రూపాయలు తీసుకొని, వారు ఎన్నికలలో ఇచ్చిన హామీలైన నవరత్నాలకు వాడుకున్నారు. పోనీ బోర్డులోని సభ్యులకు ఏమైనా క్లైములకు నిధులు చెల్లించకుండా భవన నిర్మాణ కార్మికులకు ఎవరికి బోర్డు ద్వారా నిధులు ఇవ్వకండి అన్ని నేను చూసుకుంటాను అంటూ ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996ను కాపాడా ల్సిన లేబర్ కమిషనర్ రేఖారాణి ఐ.పి.యస్ ఉదయలక్ష్మి ఒక మాట మాట్లాడకుండా ఆయన తానా అంటే తందానా అంటూ అమలు చేశారు. అప్పటి నుండి ఈ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల కష్టాలు వర్ణనాతీతం. మన పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ, పాండిచ్చేరి, మహారాష్ట్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చాలా అద్భుతంగా సంక్షేమ బోర్డులు నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలో సంక్షేమ బోర్డు భవన నిర్మాణ కార్మికులకు ఎటు వంటి సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదని వారు వాపోయారు ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వెంటనే భవననిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ను పునః ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ కెసి.బాదుల్లా, ఏపీ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా గౌరవ అధ్యక్షులు ఉద్దె. మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా అధ్యక్షుడు బి. రామాంజనేయులు, జిల్లా డిప్యూటీ సెక్రటరీ శ్రీరాములు, జిల్లా ఆఫీస్ బేరర్స్ పీరయ్య, రామాంజనేయులు, వెంకటరమణ, బాలాజీ, నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో తోట్లపల్లి పంచాయతీ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మండల పరిధిలోని తోట్లపల్లి పంచాయతీలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో నిధులు విడుదల చేయడం భాగంగానే తోట్లపల్లె పంచాయతీలో ఉపసర్పంచ్ రాయపురెడ్డి ఆధ్వర్యంలో స్థానిక యువ నాయకులు క్లాస్ వన్ కాంట్రాక్టర్ రాయపురెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 20లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. కొత్తపల్లె, పాపిరెడ్డిపల్లె బీసీ కాలనీ, తోట్లపల్లి ఎస్సీ కాలనీ నుండి ఓసీ కాలనీ వరకు సుమారు 20లక్షల రూపాయలతో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సహాయ సహకారాలతో పనులు ప్రారంభించడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి లింకు రోడ్లు ఏర్పాటుచేయాలని, గ్రామం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాలకు నిధులు కేటాయించడం జరిగిందని అందులో భాగంగానే తోట్లపల్లె పంచాయతీలో పనులు ప్రారంభించడం జరిగిందని నరసింహారెడ్డి పేర్కొన్నారు.

క్రాక్ జబ్బార్ భౌతికకాయానికి ప్రసాద్ బాబు నివాళులు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: చిన్నమండెం మండల కేంద్రంలోని సీనియర్ టీడీపీ నాయకులు క్రాక్ జబ్బార్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసి టీడీపీ పాలకమండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు బుధవారం ఆయన స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తెలుగుదేశం పార్టీకి అభివృద్ధికి ఎన్నో ఏళ్లగా ఆయన చేసిన కృషి ఎనలేదన్నారు, ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుండి ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర – సుండుపల్లె : మండలంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుండి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు లేదా ఇతరులు పరీక్షా కేంద్రం సమీపంలో ఉండరాదని అన్నారు. ప్రథమ ద్వితీయ సంవత్సరాలకు కలిపి 490 మంది బాలబాలికలు పరీక్షలకు హాజరుకానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటల నుండి ప్రారంభమవుతుందని అర్ధగంట ముందుగా పరీక్ష కేంద్రానికి విద్యార్థులు రావాలని కోరారు. ప్రతి విద్యార్థి హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

కెనరాబ్యాంక్ సేవలు ప్రారంభం

విశాలాంధ్ర - బద్వేలు : పట్టణంలో కెనరా బ్యాంక్‌ను ఆధుని కరించి సేవలు పునః ప్రారంభి చారు. కెనరాబ్యాంక్ ని ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా కడప కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ కే మురళీమోహన్ విచ్చేసి రిబ్బన్ కటింగ్ చేసి,బ్యాంకి సేవలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ఉన్న సేవల కంటే మరింత ఉన్నత సేవలను అందించడానికి కోసం మా బ్యాంకు ఎల్లప్పుడూ ముందు ఉంటుందని తెలిపారు. అతి తక్కువ సమయంలో రైతులకు తక్కువ వడ్డీతో గోల్డ్ లోన్ రుణాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. డిజిటల్ సేవలను ఖాతాదారులు వినియోగించు కోవాల్సినదిగా తెలిపారు. ప్రజలందరూ కూడా ఫిక్సడ్ డిపాజిట్ సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజరు శేపూరు బాల నరేష్,ఆంధ్ర గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రామ్మోహన్, ఫీల్డ్ ఆఫీసర్ చొప్ప ప్రమోద్ మరియు బ్యాంకు సిబ్బంది పొదుపు సంఘాల ఆర్పీలు ఖాతాదారులు పాల్గొనడం జరిగింది.

భగవద్గీత శ్లోకాలపై ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం పంచాయతీ పరిధిలోని శ్రీవారి ఆలయంలో ఈనెల మూడో తేదీ ఆదివారం నుంచి భగవద్గీత శ్లోకాలు పై బాల బాలికలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మీడియా చైర్మెన్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 నుంచి 15 సంవత్సరాల బాలబాలికలకు భగవద్గీత శ్లోకాలు ,ధ్యానం మీద ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. సనాతన ధర్మం, సత్ప్రవర్తన ,సద్బుద్ధితో మీ పిల్లలను చక్కగా తీర్చిదిద్దడానికి మీ గ్రామంలోనే వేదిక సిద్ధమైందన్నారు. మార్చి నెల 3న ఆదివారం నుంచి 2024 నుండి ప్రతి ఆదివారము, మరియు ప్రతి నెల రెండో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.ఉదయం 9:00 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించే శిక్షణకు మీ చిన్నారులకు చక్కటి అవకాశం అన్నారు. శ్రీ భగవాన్ స్వరూపానంద గీతా సంఘం, వైఎస్ఆర్ జిల్లా ముద్దనూరు మండలం, సిరాజుపల్లె గ్రామం,శ్రీశ్రీశ్రీ రాంపవన్ గారి ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9441502304 సెల్ నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

పెన్నపాడులో భాగవత సప్తాహం

విశాలాంధ్ర-వేంపల్లె: పులివెందుల నియోజకవర్గం వేముల మండలం పెన్నపాడు గ్రామంలో వారం భాగవత సప్తాహం కార్యక్రమాన్ని ప్రారంభించారు. పులివెందుల భాగవత సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గొందిపల్లి నారాయణరెడ్డి, భయపరెడ్డి, శివారెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించు కోవాలన్న ఉద్దేశంతో భాగవత సప్తాహం రామాయణ పఠనం వంటి కార్యక్రమాలను నిర్వహి స్తుంటామని వారు వెల్లడించారు. వారం రోజులు పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని భాగవతులు ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలు ఈఅవకాశాన్ని చేసుకోవాలని వర్కొన్నారు.

శివ లీలలు, హరికథా కార్యక్రమాలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణం లోని స్థానిక అగస్త్యేశ్వర ఆలయం(శివాలయం)లో 27వ తేది నుండి 4వ తేది వరకు హరి కథా సప్తాహం జరుగుతుందని, అందులో భాగంగా మూడవ రోజు గురువారం ఆల్ ఇండియా రేడియో మరియు టిడి హరి కథకులు యస్.గంగావతి భాగవతారిని కదిరి వారిచే శివ లీలలు, హరికథా కార్యక్రమాలు నిర్వహించినట్లు శివాల యం చైర్మెన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్ర మంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, సహాయ కమీషనర్ శంకర్ బాలాజి, పాలకమండలి సభ్యులు, అన్నమయ్య కళాపీఠం వ్యవస్థాపకులు యడవల్లి రమణయ్య, భాగవతార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సోషల్ మీడియా కో - కన్వీనర్ మృతి

విశాలాంధ్ర-గాలివీడు: రోడ్డు ప్రమాదం లో అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో - కన్వీనర్ మలసాని భరత్ కుమార్ రెడ్డి(25) మృతి చెందాడు. గురువారం రామాపురం మండలంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఎన్నికల ప్రచారానికి సంఘీభావం తెలిపి తిరిగి స్వస్థలం గాలివీడుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యంలో బోయపల్లె వద్ద రోడ్డుపై ట్రాక్టర్ ను తప్పించబోయే క్రమంలో ప్రమాదం జరిగింది.వెంటనే మెరుగైన వైద్యం కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే భరత్ మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారని బంధువులు తెలిపారు. అయితే ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న తోటి ప్రయాణికుడికి స్వల్ప గాయ లైనట్లు సమాచారం. భరత్ ఆకస్మిక మృతి చెందడంతో స్వస్థలం అరవీడు గ్రామంలో విషాధఛాయలు అలుము కున్నాయి. పార్టీ కార్యక్రమాలకు ఎల్లప్పుడు అందుబాటు లో ఉండే భరత్ ఇక లేరనే విషయం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జీర్ణించు కోలేకపోతున్నారు. భరత్ మృతిపట్ల వారి కుటుంబ సభ్యులకు మండల వైఎస్సార్ సీపీ నాయకులు ప్రగాఢసానుభూతి తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర- సిద్ధవటం : సిద్ధవటం ఎగువపేట బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీ సాయి హై స్కూల్ నందు విద్య - వైజ్ఞానిక సంబరాల్లో భాగంగా గత రెండు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా గురువారం ప్రతిభ చాటిన విద్యార్థినీ,విద్యార్థులకు సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. జూనియ ర్ సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్ మాట్లాడుతూ నేటి పిల్లలే రేపటి పౌరులని విద్యా విజ్ఞాన సంబరాల్లో ప్రాజెక్టులు తీర్చిదిద్దడంలో ఎంతో నైపుణ్యం కలిగి ఉన్నారని, బహుమతులు పొందిన వారు గొప్ప అని మిగతావారు తక్కువ కాదని అందరూ నైపుణ్యంతో వివిధ రకాల ఇన్నోవేటివ్ ప్రాజెక్టులు అద్భుతంగా తయారు చేశారని విద్యార్థులను కొనియాడారు. ప్రతి విద్యార్థి, విద్యార్థిని న్యాయ పరమైన అంశంలో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్కూల్ విద్యార్థు లకు తెలియ జేశారు.శ్రీ సాయి హై స్కూల్ విద్యార్థి నీ, విద్యార్థులు ఎంతో క్రమశిక్షణ కలిగి ఉన్నారని, స్కూల్ యాజమాన్యం విద్యార్థినీ, విద్యార్థు లకు క్రమశిక్ష ణతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారని తెలియజేశారు. స్కూల్ యాజమాన్యం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్‌ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పోలు వెంకటసుబ్బయ్య, చైర్ పర్సన్ రేవతి దేవి, హెడ్మాస్టర్ రాజేష్,కోర్ట్ సిబ్బం ది, ఉపాధ్యాయులు మరియు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్మశాన వాటికకు స్థలం కేటాయించండి

విశాలాంధ్ర-కాశినాయన : కాశినాయన మండ లం, రెడ్డి కొట్టాల గ్రామం మరియు జగనన్న కాలనీలో సుమారు 200 దూదేకుల, ముస్లిం మైనారిటీ కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరికి స్మశాన వాటిక అందుబాటులో లేనందున స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అన్వర్ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి, కాశినాయన మండల తాసిల్దార్‌కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ రెడ్డి కొట్టాల గ్రామంలో అనేక సంవత్సరాల నుంచి ముస్లింలు మరియు దూదేకుల కుటుంబాలు చాలా నివసిస్తున్నాయని, అదేవిధంగా గత మూడు సంవత్సరాల నుంచి జగనన్న కాలనీ వాసులు కూడా వారికి కేటా యించిన స్థలంలో ఇళ్ళను నిర్మించుకుని జీవనం సాగిస్తున్నందున, మొత్తంగా సుమారు 100 నుంచి 200 కుటుంబాల వరకు ఇక్కడ నివాసం ఉంటున్నాయి. దీని కారణంగా వీరికి అవసరమైన స్మశాన వాటిక అందుబాటులో లేనందున, మూడు కిలోమీటర్ల దూరం ఉన్నటువంటి పోరుమామిళ్ల పట్ట ణంలోకి భౌతికకాయాలను తీసుకురావడం జరుగు తోంది. కాబట్టి మీరు వెంటనే స్పందించి స్మశాన వాటికను కావలసిన స్థలాన్ని ఏర్పాటు చేయాలని ఆయన తహసిల్దార్ ను కోరామన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ కార్యకర్తలు ముజాహిద్, అల్తామాష్ మరియు స్థానికులు సుబ్బయ్య, మహబూబ్ బాష పాల్గొన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీకి అపూర్వ స్పందన

విశాలాంధ్ర- బద్వేలు : మండలం లోని తిరువెంగళపురం పంచాయతీ శ్రీరామ్ నగర్, గాండ్ల తిమ్మాయపల్లె, ఎత్తిరాజు పల్లె, రాఘవ రెడ్డి పేట గ్రామాలలో బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బొజ్జ రోశన్న సతీమణి అరుణ తెలుగుదేశం సీనియర్ నాయకులు కేవీ సుబ్బారెడ్డి, బిజివేముల రామచంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్ రెడ్డి లతో కలిసి బుధవారం సాయంత్రం ఇంటింటి ప్రచారంలో భాగంగా తెలుగుదేశం అభ్యర్థి బొజ్జ రోశన్నకు మీ అమూల్యమైన ఓట్లు వేసి గెలిపిం చాలని వారు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలు అపూర్వ స్పందన చూపిస్తున్నారని, ప్రజలు ఎంతో ఆప్యాయంగా పలుకురిస్తూ అక్కున చేర్చుకుంటున్నారని మాకు మద్దతు ఇస్తూ ఉన్నారని వారు అన్నారు అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ప్రతి ఒక్కటి పెంచి, కరెంటు, బస్సు చార్జీలు పెంచి పేద ప్రజలను దోపిడీకి గురి చేస్తున్నారని వారు తీవ్రంగా విమర్శిం చారు, 2024 జరిగే ఎన్నికల్లో మా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే వందరోజుల్లో మా నాయకుడు ప్రవేశపెట్టే పథకాలను తక్షణం అమలు చేస్తామని ఆమె అన్నారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నా రని గడచిన ఐదు సంవత్సరాల కాలంలో అధికార పార్టీ నాయకులు ఏమాత్రం అభివృద్ధి చేయకుండా వారి స్వలాభం కోసమే పాటు పడ్డారని ప్రజలను పూర్తిగా గాలికి వదిలేసారని తీవ్రంగా మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో భూమిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ అభిభన్నీసా, బైసాని రవిశంకర్ రెడ్డి నాగేంద్ల వెంకటసుబ్బారెడ్డి కార్యకర్తలు అభిమానులు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లింది

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : చంద్రబాబు లోకేష్ సభలు చూసి వైసిపి నాయకులకు దడపడుతుందని తాడేపల్లి సభ చూసి తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డి కడప అసెంబ్లీ అభ్యర్థి మాధవి రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ దొంగలకు వ్యతిరేకంగా తెలుగుదేశం, జనసేన పోరాడుతున్నాయి అన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి ఏపీకి ఎంతో కీలకం అన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజలు పెట్టుకున్న కూటమి ఇది అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైకాపా ఎమ్మెల్సీ అనంత్‌బాబు హత్య చేసి ఆ, మృతదేహాన్ని వారి ఇంటికి డోర్ డెలివరీ చేశారనరు, కరోనా సమయంలో ఫేస్ మాస్క్ అడిగినందుకు దళిత వైద్యుడు సుధాకర్‌ను మానసిక వికలాంగుడిగా ముద్రవేసి చంపారు. వైనాట్ పులివెందుల.. పులివెందులలో జగన్ రెడ్డికి ఓటమి తప్పదు అన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం సూపర్ 6ని ప్రవేశపెట్టాం అన్నారు ప్రజల సొమ్ము దోచుకోకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తాం. సాగునీరు అందించి రైతులను ఆదుకుంటాం, యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం. పాలన ద్వారా సంపాదించిన సొమ్మును పేదలకు అందజేస్తాం అన్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

విశాలాంధ్ర-మైలవరం : మండలంలోని రామచంద్రాయపల్లె మరియు మద్దిరెడ్డిపల్లె గ్రామంలో గడప గడపకు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి పాల్గొంటారని జిల్లా వైఎస్సీపీ ప్రధాన కార్యదర్శి మహేశ్వర రెడ్డి విలేకరులకు తెలిపారు. కావున నాయకులు, కార్యకర్త లు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసింది గా కోరారు.

ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ

విశాలాంధ్ర-వేంపల్లె: చక్రాయపేట మండలం మారెళ్ళ మడక గ్రామంలో గురువారం ఓటు హక్కు వినియోగంపై ఆర్కే వేలి ట్రిబుల్ ఐటీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్-9 అధికారి బొజ్జా అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టి ఓటు హక్కు వినియోగం, అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోవాలని ఆర్కేవ్యాలీ ట్రిబుల్ ఐటి సంచాలకులు డా. కుమారస్వామి గుప్తా, ఎన్ఎస్ఎస్ యూనిట్-9 అధికారి బొజ్జా అనిల్ కుమార్ రెడ్డి కోరారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి ర్యాలీగా వెళ్లి ఓటు హక్కు వినియోగం, అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

విశాలాంధ్ర-పీలేరు: పదవీ విరమణ చేసిన తమ సహచరుడికి పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. ఆ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసు న్న టి. వెంకటరమణ గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి వెంకటరమణ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గంగాదర్, ఉపాధ్యాయులు రేణుక, షరీఫ్, రామ్మూర్తి, రమణయ్య, ఫరూఖ్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ దూరం

విశాలాంధ్ర-పీలేరు: అవగాహనతోనే ఎయిడ్స్ మహ మ్మారి నుంచి దూరంగా ఉండగలమని పీలేరు ప్రభుత్వ అసుపత్రి సూపరిం టెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. పీలేరు బస్టాండులో గురువారం జై శంకర్ కళాజాత బృందం ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి, దాని తీవ్రత నివారణ చర్యలపై నాటక ప్రదర్శనతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఈశ్వర సురేంద్ర, -సీటీసీ కౌన్సెలర్ రవి, ఎల్డీ మోహన మురళీ, కోర్' స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ సుమలత, బృందం సభ్యులు హసీనా, రాజమ్మ, సల్మాన్, పర్మల, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి మహాప్రభో

కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లు లబోదిబో

విశాలాంధ్ర-మదనపల్లి : సమస్యలను పరిష్కరించండి మహాప్రభో అంటూ అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, రామిశెట్టి శివయ్య, పాల్ చంద్రశేఖర్ లు లబోదిబో మన్నారు.గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ వరపన మనూజ కిరణ్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఏ మున్సిపాలిటీ లో అయినా సమస్యలను పరిష్కరించాలని ప్రతిపక్ష పార్టీకి చెందిన కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో వారి గళాన్ని వినిపిస్తారు. మదనపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు వారి వార్డుల్లో సమస్యలు పరిష్కరించకపోవడమే కాకుండా మున్సిపల్ కార్యాలయ అధికారులు సమస్యలు చెప్పుదామంటే ఫోన్ చేస్తే రిసీవ్ చేయడం లేదని చైర్ పర్సన్ వరపన మనూజ కిరణ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కౌన్సిలర్ షేక్ కరిముల్లా మాట్లాడుతూ మున్సిపాలిటీ కి సంబంధించి 43 సచివాలయాలు ఉన్న వాటిని వార్డుకు ఒకటి చొప్పున 35 సచివాలయాలుగా మార్చాలన్నారు. ఒకే సచివాలయానికి ఇద్దరు కౌన్సిలర్లు వెళ్లాల్సిన అవసరం లేదు. వర్షాలు పడకపోవడం వల్ల నీటి సమస్య వస్తుంది. సానిటేషన్ సమస్య ఎక్కువగా ఉంది. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, చైర్ పర్సన్ వరపన మనూజ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.రామశెట్టి శివయ్య మాట్లాడుతూ తమ వార్డులు నీటి సమస్య ఎక్కువగా ఉంది. ఇంతవరకు ఒక రోడ్డు వేయలేదు. త్వరలో ఎన్నికలు వస్తున్నాయి. వార్డులోని ప్రజలను మా పార్టీకే ఓటు వెయ్యండని ఏ ముఖం పెట్టుకొని వెళ్లి అడగలంటూ ఆవేదన వ్యక్తం చేశారు..మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్ ఆజాం మాట్లా డుతూ పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటికే చాలామంది కుక్కలు కరిచాయి.ఈ సమావేశంలో కౌన్సిలర్లు శ్రీనివాసులు, మందపల్లి వెంకట రమణ, ఆర్ వి శివారెడ్డి, ఎస్ వి రమణ, ఈశ్వర్ నాయక్, వసీం అక్రమ్, ముబీన, గిరిజ, అధికారులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా దూకుడు పెంచిన నల్లారి

విశాలాంధ్ర-పీలేరు: కె వి. పల్లి మండలం తన గెలుపే లక్ష్యంగా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పీలేరు నియోజకవర్గంలో తనగెలుపే లక్ష్యం గా బాబు షూరిటీ-భవిషత్తు గ్యారంటీ కార్యక్రమంలో పెండ్లి పెంట,ప్యాయల వారిపల్లి, కురవ పల్లి,చింతలోళ్ళ పల్లి, పాలెం గడ్డ పలు గ్రామాల్లో ఇంటింటా తిరిగి తెలుగుదేశం ప్రవేశపెట్టిన పథకాలు వివరిస్తూ కర పత్రాలు పంచారు.ఈ కార్యక్రమం మండల అధ్యక్షురాలు గీతమ్మ, జిల్లేళ్ల మంద పంచాయతీ ఇంచార్జ్ సురేష్ కుమార్ రెడ్డి అలియాస్ (కంచి సూరి),రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కుప్పం రావిచంద్రా రెడ్డి, అధ్యక్షతన జరిగింది. నల్లారి కిషోర్ మాట్లాడుతూ నియోజక వర్గంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొం డలు, గుట్టలు,మాయం చేస్తూ ఇసుక, మట్టి,మైనింగ్ లాంటి ప్రకృతి సంపదను దోచుకొంటు కోట్ల రూపాయలు కొల్లగొడు తున్న వైకాపా నాయకుల్ని సాగనంపాలని పిలుపునిచ్చారు.అక్రమ సంపాదనతో ఓట్లు కొనాలని ప్రయత్నిస్తున్న వారికి వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కుతో గుణపాఠం చెప్పాలని అన్నారు.రాష్ట్రంలో జగన్ రెడ్డి ప్రభుత్వంలో మోసపోయిన మహిళలు ఆర్థికంగా ఎదుగుదలే లక్ష్యంగా చంద్రబాబు ప్రకటించిన పథకాలతో మహిళలు మహాశక్తిగా ఎదగాలని,రాష్ట్ర మహిళల అభివృద్ధి, సంక్షేమం దృష్టిలో పెట్టుకొని అన్నిరంగాల్లో మహిళలు ముందుండాలని అన్నారు. టీడీపీ మహిళల కోసం చేపట్టిన"ఆడబిడ్డ నిధి"కింద18ఏళ్ళు నిండిన స్త్రీకు ప్రతి నెల 15,00వేలు,"తల్లికి వందనం" పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువు తుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి 15,000వేలు, దీపం'పథకం ద్వారాఏడాదికి గృహిణీలకు 3సిలిండర్లు ఉచితంగా అందిస్తూ, ఉచిత బస్సు ప్రయాణంద్వారా మహిళలందరికి టికెట్టులేని ప్రయాణం లాంటి సంక్షేమాలను టీడీపీ శ్రీకారం చుట్టనుందన్నారు.ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కుప్పం రావిచంద్రా రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శిమౌలా, పీలేరు నియోజకవర్గ తెలుగు యువత మహేంద్ర రెడ్డి, గాలి సుధాకర్ నాయుడు, ప్రసాద్ రెడ్డి మాజీ జడ్పీటీసీ ఉదయమ్మ, శేషాద్రి నాయుడు,మాజీ ఎంపీపీ రమణ, రాజశేఖర్ నాయుడు, ఒడ్డెప్పరెడ్డి, శివారెడ్డి, రంజిత్, వెంకటేశ్వర రావు, రమణా రెడ్డి, ప్రసాద్,రెడ్డి శేఖర్, రహంతుల్లా, వెంకీ,టీడీపీ అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పాల్గొన్నారు.

పదవి విరమణ సన్మాన కార్యక్రమం

విశాలాంధ్ర -మదనపల్లి : స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, బాలాజీ నగర్‌లో నేడు పదవి విరమణ చేసిన సరోజ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులు ప్రభాకర్ రెడ్డి,రాజగోపాల్, పద్మావతి మాట్లాడుతూ అన్ని వృత్తుల కెల్లా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, ఎంతోమంది విద్యార్థులను శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, డాక్టర్లు మంచి పౌరులుగాను తీర్చిదిద్దగల ఏకైక వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని కొనియాడారు. ఎస్ టి యు అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూదన మాట్లాడుతూ నేడు పదవి విరమణ చేయుచున్న సరోజ మేడం వృత్తిపట్ల అంకితభావంతో పనిచేశారని, తన సర్వీస్ మొత్తము పిల్లలు, బడి అనే బాధ్యత కలిగి ఉన్నారని, ఇటువంటి ఉత్తమ ఉపాధ్యాయుల నుండి నేటి ఉపాధ్యాయ వర్గం ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్ధన్, చీకలిబయలు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరినాథ్ రెడ్డి, రాంబాబు, శైలజ శ్రీ, అమర్నాథ్, ఈశ్వర్ నాయక్, కాశీనాథ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఆర్టీసీ బస్సు నడపాలంటే విద్యార్థుల ధర్నా

విశాలాంధ్ర - రామసముద్రం : సకాలంలో ఆర్టీసీ బస్సు నడపా లంటూ విద్యార్థులు ధర్నా చేశారు. రామసముద్రంచెంబ కూరు వయామదనపల్లికి వెళ్లే ఆర్టిసి బస్సు నాలుగు గంటల పది నిమిషాలకు రావాల్సి ఉండగా ఐదు గంటల పైన వస్తోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మట్ల వారి పల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు పాఠశాల వద్ద పాఠశాల వద్ద ఆర్టీసీ బస్సు ముందు రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. 150 మందికి పైగా విద్యార్థులు ఆర్టీసీ బస్సు పాసులు తీసుకున్నట్లు తెలిపారు. మదనపల్లె ఆర్టీసీ డిపో మేనేజర్ స్పందించి తమకు అనుకూలమైన సమయంలో బస్సు నడపాలని కోరారు.

హార్సిలీహిల్స్‌లో ప్రభుత్వ భూములు,భవనాలను ప్రైవేటీకరణ మానుకోవాలి

ఆక్రమణలు తొలగించి, హార్సిలీహిల్స్ ను అభివృద్ధి చేయాలి :ఏఐటీయూసీ

విశాలాంధ్ర-మదనపల్లి : ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఆంధ్ర ఊటీగా పేరొందిన హార్సిలీహిల్స్‌లో ప్రభుత్వ భూములు, భవనాలను ప్రైవేటీకరణ ఆపాలని హార్సిలీహిల్స్ ను అన్ని విధాల అభివృద్ధి చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు.ఆ మేరకు గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ కు ఏఐటీయూసీ జిల్లా నాయకులు సాంబశివ, సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, గంగాధర్, సలీం భాష, వేణు గోపాల్ రెడ్డి లు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌లో ప్రభుత్వ భూములు క్రమక్రమంగా లూటీ అవుతున్నాయని, ప్రభుత్వం అధికారికంగా హార్సిలీహిల్స్ లో ప్రభుత్వ భూములు, భవనాలు ప్రైవేట్ సంస్థలకు కట్టబెడుతూ లీజుకిస్తున్నదిని ఆరోపించారు. ఆక్రమణలు ,అక్రమ నిర్మాణాలతో హార్సిలీ హిల్స్‌లో ఉన్న ప్రభుత్వ భూములు,భవనాలు పరాదీనం అవుతున్నాయని అన్నారు.అక్కడ ఉన్న విలువైన భూములు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్‌కి ప్రోత్సహిస్తున్నారని వారు తీవ్రంగా విమర్శించారు..ఇతర రాష్ట్రాల నుంచి ఆహ్లాదానికి సేద తీరడానికి వస్తున్న పర్యాటకులకు కనీస వసతులు సౌకర్యాలు కూడా కల్పించలేని పరిస్థితి నేడు నెలకొన్నదని అన్నారు.హార్సిలీహిల్స్ పైకి రోప్ వే,రిషీ వ్యాలీ సమీపంలోని బోర్లు వేసి రెండో పైపులైన్ ద్వారా నీటిని తీసుకెళ్ళాలనే ప్రతిపాదన అమలు కాలేదని,.హార్సిలీహిల్స్‌పై అనుబంధంగా ఉన్నసంస్థలను కాపాడాలని కోరారు. హార్సిలీ హిల్స్‌లో టౌన్ షిప్ అనుమతి లేకుండా అక్రమంగా ఇచ్చిన లీజులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని కోరారు. యాత్ర-2 సినిమా డైరెక్టర్ మహి రాఘవ సంస్థకు హార్సిలీహిల్స్ కొండపై సర్వే నంబర్ 371-2లో కేటాయించిన భూమిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హార్సిలీహిల్స్ లో ప్రైవేటును ప్రోత్సాహంచడం ద్వారా ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యం అయిపోతున్నాయని,కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా అధికారులు ఆరు కోట్లతో అభివృద్ధికి ప్రణాళికలు రచించినా అభివృద్ధి జరగడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.టూరిజంలో ఏటా ఐదు కోట్లు రూపాయలు ఆదాయం వస్తుండగా ఆ స్థానంలో అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదు. ఇప్పటికైనా అధికారులు హార్సిలీహిల్స్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు అక్రమ లీజు లపై తీసుకోవాలని ఆర్సిలీహిల్స్ ను అన్ని విధాల అభివృద్ధి చేయాలని లేని పక్షంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలో జిల్లా వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్, జిల్లా కోశాధికారి సలీం భాష, ఉపాధ్యక్షుడు వేణు గోపాల్ రెడ్డి, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో అక్రమ ఉద్యోగ నియామకాలపై ఆందోళన

విశాలాంధ్ర-మదనపల్లి : బహుజన్ యువసేన బివైఎస్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఎదుట ఆప్కాస్ ఉద్యోగ నియమకాలలో అవినీతికి పాల్పడి కౌన్సిల్ సైతం తప్పుదావ పట్టించిన మున్సిపల్ కమిషనర్ ప్రమీలను వెంటనే సస్పెండ్ చేయాలని, అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని నినాదాలు ఇస్తూ పెద్ద ఎత్తున ధర్నా చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం బహుజన యువ సేన అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ ఉద్యోగ నియమకాలలో అర్హత లేని వారిని అవినీతికి పాల్పడి మున్సిపల్ కమిషనర్, నియమించారని పునీత్ అన్నారు ఏపి సిఓస్ నిబంధనలు ప్రకారం ఎవరైతే ఆప్కాస్ లో పనిచేసి పదవి విరమణ, లేదా అకాల మరణం చెందిన వారికి ఎలాంటి బెనిఫిట్స్ గాని, పెన్షన్ గాని రాదు కాబట్టి, వారి అనంతరం వారి కుటుంబ పోషణలకై వారి కుటుంబంలో ఎవరికో ఒకరికి ఆప్కాస్ లో ఉద్యోగం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కానీ అలాంటి అర్హత కలిగిన వారికి ఇవ్వకుండా, అవినీతికి పాల్పడుతూ సంస్థ కానీ, మదనపల్లి మున్సిపాలిటీ గాని ఎటువంటి సంబంధం లేని వారికి, మరీ ముఖ్యంగా స్థానికులు కాకుండా, ఈ జిల్లా వారే కాకుండా బయట జిల్లా వారికి, ఉద్యోగ నియామకాలు జరిగాయని వాటి గురించి సమాచారం. సమాచార చట్టం ద్వారా వారికి వచ్చిందని, వాటికి సంబంధించిన ఆధారాలు చూపుతూ, కరోనాలో చాలామంది లో పనిచేసే వారే చనిపోయారన్నారు. వారికి ఇవ్వకుండా, సాధారణంగా కరోనాలో చనిపోయిన చనిపోయినారు మాకు ఉపాధి కల్పించండి అని కేవలం అర్జీ ద్వారా నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ, అవినీతికి పాల్పడుతూ వారికి ఉద్యోగాలు ఎలా ఇస్తారని పునీత్ ప్రశ్నించారు. అలాగే నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారం, కమిషనర్ నచ్చినవారికి ఉద్యోగాలు ఇవ్వడానికి, మున్సిపల్ కార్యాలయం ఏమి కమిషనర్ సొంత కంపెనీ కాదని, ఆమె ప్రభుత్వ కార్యాలయంలో ఒక అధికారి మాత్రమే అని గుర్తుంచుకోవాలని పునీత్ అన్నారు, అలాగే చైర్మన్ , చైర్మన్, అధికార పార్టీ కౌన్సిలర్లు, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు నిజంగా వారిని ఎన్నుకున్న ప్రజలకు నీతి నిజాయితీగా పనిచేసే వారు అయితే వెంటనే అక్రమంగా జరిగిన, నియామకాలను ఆపాలని, లేనిపక్షంలో కారు మళ్లీ ఓటు కోసం ప్రజల దగ్గరికి వెళితే సరైన గుణపాఠం నేర్పుతారని పునీత్ అన్నారు, కావున అధికారులు ఇప్పటికైనా మేల్కొని అనర్హులైన వారిని గుర్తించి వారిని తొలగించి, నిజమైన అర్హులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పునీత్ అన్నారు. లేనిపక్షంలో ఎవరైతే అధికారులు ఈ అవినీతిలో పాలుపంచుకున్నారో వారి పైన వెంటనే లోకయుక్తకు వెళ్లి వారి పైన చర్యలు తీసుకునే లాగా, పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ఉద్యమం చేపడతామని, పునీత్ హెచ్చరించారు,ఈ కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు హరీష్, సుధాకర్, నవీన్,వెంకటేష్,రాజు,జగదీష్,మల్లికార్జున,శ్రీనివాసులు,కిషోర్, దేవేష్, వినయ్, శశి కుమార్, ద్వారకనాథ్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకే ఆదర్శం మాధవరం హ్యాండ్లూమ్స్

విశాలాంధ్ర- ఒంటిమిట్ట : జిల్లాకే ఆదర్శం కొత్తమాధవరం చేనేత చీరలు అని కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బి.హరిప్రసాద్, రాజంపేట నియోజకవర్గం తెలుగుదేశం నాయకులు మేడా విజయ శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఒంటిమిట్ట మండలంలోని కొత్తమాధవరం గ్రామంలో శ్రీఉదయకృష్ణ హ్యాండ్లూమ్స్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాధవరం చీరలు ఇక్కడ తయారు చేసిన కాటన్, శిల్క్ కాటన్, శిల్క్‌శారీస్, పట్టు చేనేత చీరలు ఈ జిల్లా, రాష్ట్రానికే కాకుండా వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. దేశంలో మాధవరం చేనేత చీరలకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉందన్నారు. అనంతరం వారి అమృతహస్తాలతో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ ఎస్.వి.రమణ, టీడీపీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు, సిద్దవటం మండలం మాజీ జడ్పీటీసీ చలమయ్య యాదవ్, సీనియర్ జర్నలిస్టు మోదగల నరసింహులు, కోదండ రామాలయ మాజీ ధర్మ కర్త పలుకూరి దత్తాత్రేయ, టక్కోలి మాజీ ఎంపీటీసీ నాగ మునిరెడ్డి, కొత్తమాధవరం టీడీపీ నాయకులు బాలకృష్ణ, కొండమాచుపల్లె టీడీపీ నాయకులు ఎంవి రమణ, ఒంటిమిట్ట మండల టీడీపీ నాయకులు హరినాథరెడ్డి, శివారెడ్డి, మండల బీసీ నాయకులు చౌడయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పల్స్ మెడికల్ షాపును ప్రారంభించిన అజయ్ రెడ్డి

విశాలాంధ్ర - సుండుపల్లి : మండలం కేంద్రంలో పల్స్ మెడికల్ షాప్ ను రాజంపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యర్రపురెడ్డి అజయ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలకు నాణ్యమైన మందుల తోపాటు మంచి వైద్యాన్ని అందించాలన్నారు ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మంత్రం నిర్వాహకులు అజయ్ రెడ్డికి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ డాక్టర్ శిరీష వేణు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయులు

విశాలాంధ్ర- ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు మానవత్వం చాటుకున్నారు. ఇబ్బందులో ఉన్న వారిని ఆదుకోవాలని సముద్రేశం కలిగిన ఉపాధ్యాయులు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కృష్ణ పరిస్థితిని తెలుసుకొని ఆయనకు తమ వంతు సహాయ సహకారాలు అందజేశారు. ఇందులో భాగంగా ఒంటిమిట్ట మండల పరిధిలోని కల్లా వీధిలో కాపురం ఉండే శివ కృష్ణ అనే వ్యక్తి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆరోగ్యం పూర్తిగా పాడవడంతో తమ భార్య బిడ్డలను సాకలేని స్థితిలో ఉన్నారు.. ఈ ఒంటిమిట్ట మండల పరిధిలోని ఉపాధ్యాయులు మానవత్వం చాటుకుని గురువారం శివ కృష్ణ ఆ ఇంటికి వెళ్లి 29,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇంతటి అనారోగ్య స్థితిలో ఉన్న ఆయనకు తమ వంతు సహాయంగా మండల పరిధిలోని ఉపాధ్యాయులు అందరూ కలిసి ఈ మొత్తాన్ని అందజేశామని వారు తెలిపారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఇలాంటి పరిస్థితి జీవితంలో ఎవరికీ రాకూడదని అన్నారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఇలాంటి వారికి సహాయ సహకారాలు అందజేయాలని వారు కోరారు.చిన్న విన్నపముతో కూరగానేమండల పరిధిలోని ఉపాధ్యాయులు స్పందించారని, ఆర్థిక సహాయం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ

తంబళ్లపల్లి టిడిపి, జనసేన ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థిగా జయచంద్ర రెడ్డే

-వదంతులు నమ్మకండి... అధిష్టాన నిర్ణయాన్ని గౌరవించాలి

అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చెర్తి జగన్మోహన రాజు, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి

విశాలాంధ్ర- మదనపల్లి : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం టిడిపి అభ్యర్థిగా దాసరిపల్లె జయచంద్రారెడ్డిని ఖాయం చేసినట్లు రాజంపేట పార్లమెం టు టిడిపి అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం అన్నమయ్య జిల్లా మదనపల్లి లోని టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు పలు రకాలుగా సర్వే నిర్వహించి జయచంద్రారెడ్డి సమర్థుడని, ఆయనే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డిపై గెలవడం ఖాయమని ఆయనకే టికెట్ కేటాయించారన్నారు. కానీ కొంతమంది స్వార్థపరులు జయ చంద్ర రెడ్డికి పెద్దిరెడ్డి కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని సోషల్ మీడియా లో దుష్ప్రచారాలు చేస్తున్నారన్నారు. తంబళపల్లి నియోజకవర్గ టిడిపి శ్రేణులు వీటిని నమ్మవద్దని కోరారు. త్వరలో శంకర యాద వ్ సహకారంతో జయచంద్రారెడ్డి ప్రచారం చేసేలా చర్యలు చేపడతామన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చంద్రబాబు, రాజంపేట పార్లమెంటరీ నాయకులు ఆర్వే వెంకటేష్, దొర స్వామి నాయుడు, ఎస్‌వి మస్తాన్, బీసీ నాయకులు శ్రీరాములు, మాజీ సర్పంచి పటాన్ ఖాదర్ ఖాన్, హోటల్ శంకర్, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వస్తువులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-రాయచోటి: తమ హక్కుల పరిరక్షణ కోసం ప్రస్తుతం అమలులో ఉన్న వినియోగదారుల చట్టం-2019 గురించి వినియోగదారులు అవగాహన కలిగినకిలీ వస్తువుల పట్ల అప్రమ త్తంగా ఉండాలని రాయచోటి మునిసిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి కోరారు. భారతీయ ప్రమాణాల సంస్థ వారి ఆధ్వర్యంలో గురువారం సంబేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లోస్టాండర్డ్స్ క్లబ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి మాట్లాడు తూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహ న కల్పించ డం శుభ పరిణామం అన్నారు. దశాబ్దాలుగా ప్రకటనలకే పరిమితమైన 'స్కూల్ కన్స్యూమర్ క్లబ్'లను ప్రస్తుత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి స్కూల్లోనూ ఏర్పాటు చేయడం ఆనందించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులే వినియోగదారులుగా తమ హక్కులను అర్థం చేసుకోవడం తో పాటు వాటిని తమ కుటుంబ సభ్యులకు, గ్రామాల్లోని నిరక్షరా స్యులకు తెలియజేసేం దుకు ప్రభుత్వం ఈ క్లబ్‌లకు రూప కల్పన చేయడం జరిగింద న్నారు. అవగాహన కల్పించడం లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతిగా అందజేశా రు . ప్రథమ బహుమతిగా రుక్సానా 1000/-, ద్వితీయ బహుమతిగా సాయి శరణ్య 750-, తృతీయ బహుమతిగా హర్షిత 500/-, ప్రోత్సాహక బహుమతులు గా ఆదిత్య వర్ధన్ నాయక్ కు 250/- అందించడంతో పాటు మోమెంటో మరియు సర్టిఫికెట్స్ ను ప్రధానం చేశారు . ఈ కార్యక్రమంలో ప్రసన్న కుమార్ ,ముదిశెట్టి రెడ్డి శేఖర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రెడ్డయ్య రెడ్డి, శంకరయ్య, ఓబుల్ రెడ్డి,మాబు హుస్సేన్ విద్యార్థులు పాల్గొన్నారు.

9లోపు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఓబులవారిపల్లి : ఏపీఎండీసీ నందు పనిచేసే కార్మికుల సమ స్యలను హెడ్ ఆఫీస్ నందు 9వ తేదీ జరగనున్న సమావేశం లోపల పరిష్కరించాలని ఏపీఎండిసి యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు తల్లెం రమణారెడ్డి, పోకూరు మురళి, సగినాల సుబ్రహ్మణ్యం, గుంతా భాను ప్రకాష్ లు కోరారు. మంగంపేట బ్రాంచ్ లో చీఫ్ బ్రాంచ్ ఆఫీసర్ తో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి బుధవారం చర్చించారు. ఈ సమావేశంలో బత్తల హరి, గల్లా శ్రీనివాసులు, నారదాసు మణికంఠ, కాలవ సుబ్రహ్మణ్యం, శేఖర్, గ్రంధి మణికంఠ, పార్ల వెంకట కిషోర్ కార్మికులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి వైసీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి) పట్టణంలో ప్రజలు నీటి సమస్యతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ప్రస్తుతం నీటి సమస్య పూర్తిగా నివారించడం జరిగిందన్నారు. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా ప్రతి ఇంటికి పైప్ లైన్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గతంలో ఎప్పుడూ ఎన్నడు కనీవిని ఎరుగని రీతిలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని ఈ పథకాలు ఇలాగే కొనసాగా లంటే ప్రతి ఒక్కరు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి విశేష కృషి చేస్తూ అనేక సంక్షేమ, పథకాలు అమలు చేస్తోందన్నారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల నుంచి వంద పడకలకు పెంచడం ఎంతో గొప్ప విషయమన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఆసుపత్రికి సంబంధించి రోడ్ల సమస్య, సిబ్బంది సమస్యలు లేకుండా వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో పేదలందరికీ ఇంటి పట్టాలు పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టి రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇంటి పట్టాలు పొందిన వారందరికీ సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించి పేదలకు ఒక భరోసా కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందజేసిన ఇంటి స్థలంలో ప్రతి ఒక్కరు ఇల్లు నిర్మించుకొని సంతోషంగా జీవించాల న్నారు. ఎవరు కూడా ఇంటి పట్టాను అమ్ముకోకుండా ఒక ఆస్తిలా స్థిరస్థాయిగా నిలుపుకోవాలన్నారు.అనంతరం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... పీలేరు పట్టణంలో 50 పడకల ప్రభుత్వాసుపత్రిని వంద పడకు మార్చుకోవడం ప్రతి ఒక్కరు గర్వించదగ్గ విషయమన్నారు. వైద్యులు రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందివ్వడం జరుగుతుందన్నారు. సచివాలయ వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి పథకాన్ని పేదల ఇంటి ముంగటకు చేర్చడం జరుగుతుందని ప్రతి ఒక్కరు ఈ ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, ఆర్డీఓ రంగస్వామి, పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ డాక్టర్లు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజక వర్గ కేంద్రం కోడూరు నుండి చిట్వేల్ వరకు పెండింగ్ లో ఉన్న డబుల్ రోడ్డు నిర్మాణానికి గురువారం ఉదయం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులు అన్ని చరిత్రలో నిలిచిపోతాయన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమ నవర్మ,ఎపి టూరిజం డైరెక్టర్ వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి, జిల్లా కో ఆప్షన్ నెంబర్ అన్సర్ భాష, డైరెక్టర్ మలిశెట్టి వెంకట రమణ, అర్ అండ్ బి ఇఇ సహదేవరెడ్డి, డిఇఇ జయప్రకాష్, జడ్పిటిసి పాలెంకోట రత్నమ్మ, చిట్వేల్ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే పిఎస్ ఎంసి కిష్టయ్య, సర్పంచి బుడిగి శివయ్య, ఉపసర్పంచ్ తోట శివసాయి, మాజీ జడ్పిటిసి మారెళ్ళ రాజేశ్వరి, కసరం అరణ, లింగం లక్ష్మీకర్, కంపరాజు నాగేంద్రరాజు, పట్టణ అధ్యక్షులు సిహెచ్ రమేష్ బాబు, పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : తిరుపతి వేదికగా మార్చి 1న శుక్రవారం తిరుపతిలో జరిగ బోయే రాష్ట్ర అభివృద్ధి,ఏపి కి ప్రత్యేక హోదాపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిక్లరేషన్ ప్రటించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిసిసి జనరల్ సెక్రెటరీ లీలా‌శ్రీనివాస్ కొండేటి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. రాజకీయాల కోసం ప్రత్యేక హోదా అంశాన్ని వాడుకున్నారన్నారు. అధికారం లోకి వచ్చాకా హోదా ప్రస్తావన లేదన్నారు. హోదా లేక 25 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక, ఆర్థిక న్యాయం

విశాలాంధ్ర-కాశినాయన : కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో దేశంలో సామాజిక, ఆర్థిక రాజకీయ న్యాయం జరుగుతుం దని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌డి విజయ జ్యోతి పేర్కొన్నారు. మోడీ హయాంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయిందని అటువంటి ప్రభుత్వం తో మైత్రి కోసం అరులు చాచడం ప్రాంతీయ పార్టీలు చేస్తున్న తప్పిదమ న్నారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే రాష్ట్ర ప్రజలు మరో ఐదు సంవత్సరాల పాటు కష్టాలు పాలవుతారు కాంగ్రెస్ పార్టీ పేదల జీవితాలలో మార్పు తీసుకురావాలని పేద మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేసి ఆర్థిక న్యాయాన్ని అందించి పేదరికాన్ని నిర్మూలిం చాలంటే ఒక కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు అలాగే ఇందిరమ్మ అభయం కింద ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు 5000 రూపాయలు ఆర్థిక సహాయం కాంగ్రెస్ పార్టీ అందిస్తున్నారు. ఈ పథకం అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు అంతే కాకుండా ప్రత్యేక హోదా కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమన్నారు ప్రత్యేక హోదా వల్ల కేంద్ర ప్రభుత్వ పథకాలకు 90% కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందన్నారు. ఇవన్నీ సాధ్యం కావాలంటే రాష్ట్రంలో షర్మిలారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. అలాగే కేంద్రంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసుకోవాలన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-గాలివీడు: ప్రతీ ఒక్కరు భక్తి భావం పెంపొం దించుకోవా లని మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నా రు.గురువారం మండల కేంద్రంలోని బుట్టిగారిపల్లెలో శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ,కళ్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొన్నా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భక్తి భావంతో సత్ప్రవర్తన,మానసిక ప్రశాంతతను పొందవచ్చన్నారు. అంతేగాక దేవాలయాలు ఏర్పాటు ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెరిగి సంస్కృతి, సాంప్రదా యాలను పాటించు కుంటూ వారి యొక్క వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకుని మెరుగైన సమాజం కోసం కృషి చేస్తారన్నారు. అందుకోసమే పెద్దలు ప్రతీ గ్రామంలో గుడి,బడికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఈకార్యక్ర మంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫేర్‌లో పీస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : జాతీయ సైన్స్ ఫెయిర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కడప మౌలానా ఆజాద్ యూనివర్సిటీ నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పీస్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న సయ్యద్ ఫజియా కు పోస్టర్ ప్రెజెంటేషన్ లో మొదటి బహుమతి అందుకుంది. అలాగే పీస్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న డి అఫిఫా మరియు షేక్ నాజియా కు మోడల్ ప్రెజెంటేషన్ లో రెండవ బహుమతి అందుకున్నందుకు పీస్ స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ మౌలానా ఆజాద్ యూనివర్సిటీ కు 5 ప్రాజెక్టులు పంపిం చడం జరిగిందని, అందులో రెండు ప్రాజెక్టులు బహుమ తులు అందుకున్నందుకు విద్యార్థులకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ఇటువంటి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలలో విద్యార్థులు తమ మేధో శక్తితో పాటు ప్రతిభను కనబరిచే గొప్ప అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

ప్రశాంతంగా ఉన్న కడపలో రెచ్చగొట్టే మాటలు వద్దు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగర ప్రజలు అన్ని కులాల వారు మతలవారు కలిసి పండుగలు చేసుకునే సంస్కృతి కడప చరిత్రకు ఉందని అటువంటి కడపలో రాజకీయ లబ్ధి కోసం కులాలకు మతాలకు రెచ్చగొట్టి వ్యాఖ్యలు చేసి లబ్ధి పొందాలనుకోవడం సరికాదని టీటీడీ బోర్డు మెంబర్ మాసిమా బాబు అన్నారు. గురువారం కడప నగరంలోని వైయస్సార్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఇటీవల మా 39 వ డివిజన్ ఇంచార్జ్ కమల్ భాష కొడుకును తెలుగుదేశం పార్టీ వాళ్లు దాడి చేసి కత్తితో పొడిచినరని ఆయన తెలిపారు. అయితే అసభ్యకర పోస్టింగులు సోషల్ మీడియాలో పెడుతున్నారని పలుమార్లు పోలీస్ స్టేషన్లో పిరియడ్ చేశామని తెలిపారు .రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ అతనిని మందలించాడని తెలిపారు. అయినప్పటికీ పోస్టింగులు పెడుతూనే ఉన్నారని ఎందుకు పోస్టింగులు పెడుతున్నావని అడిగితే దాడి చేసి కత్తితో పొడిచారని తెలిపారు. తెలుగు దేశం పార్టీ నాయకులు పొడిచిందాన్ని సమర్థిస్తూ రెండు నెలలే మీ పని అయిపోతుంది మీ అంతు చూస్తాం అనడం సరికాదన్నా రు. మా నాయకులు అంజాద్ భాష సౌమ్యుడు ఇంటికి ఎవరు వచ్చినా ఆత్మీయంగా పలకరిం చి వారి అవసరాలు తీర్చిన నాయకుడు అన్నారు .కడపలో ఎప్పుడు లేని విధంగా ఇటువంటి రాజకీయ దాడులు సరికాదని అన్నారు. కడపలో హిందూ ముస్లిం అనే తేడా లేకుండా కలిసిమెలిసి అన్నదమ్ముల ఉంటామని ఆయన తెలిపారు. రాజకీయంగా ఆంధ్రప్రదేశ్ మొత్తం మా నాయకులు జగన్మోహన్ రెడ్డి 175 సీట్లలో వైసీపీ అభ్యర్థులు నిలబడుతున్నారని వారి గెలుపుకు మేమందరం కష్టపడి పని చేస్తామని తెలిపారు .మా నాయకులు జగన్ మోహన్ రెడ్డి మీ కుటుంబంలో మేలు జరిగి ఉంటే ఓటు వేయండి అని ధైర్యంగా మేము ఓటు అడుగుతున్నాం మీరు ఏమైనా మేలు చేసి ఉంటే మీరు కూడా అలానే అడగండి అంతేకానీ రాజకీయాలు చేస్తూ గొడవలు సృష్టించకండి దయచేసి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్పొరేటర్లు సూర్యనారాయణ రావు, పాక సురేష్, షఫీ, రామ లక్ష్మారెడ్డి ,బండి ప్రసాద్ ,శివకోటి రెడ్డి, ఈటె.రామచంద్రయ్య , ఆరిపుల్లా,సుబ్బరాయుడు, ఐస్ క్రీమ్ రవి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటాపురం భవిష్యత్‌కు గ్యారెంటీ

భూపేష్ సతీమణి జ్యోతి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : జరుగనున్న ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ద్వారా ఎర్రగుంట్ల మండల పరిధిలోని పి.వెంకటా పురం గ్రామం అభివృద్ధి చెంద డం ఖాయమని జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ బాధ్యులు, ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి సతీమణి చదిపిరాళ్ల జ్యోతి హామీ ఇచ్చారు. గురువారం తన అత్త (భూపేష్ తల్లి) సరస్వతమ్మతో కలిసి గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తెలుగు మహిళలు వీరికి సాదర స్వాగతం పలికారు. జ్యోతి, సరస్వతమ్మ స్థానిక తెలుగు మహిళలతో కలిసి ప్రతి గడప తలుపు తట్టారు. పార్టీ మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు పైబడిన మహిళలకు నెలకు రూ.1500లు చొప్పున ఏడాదికి రూ.18వేలు, తల్లికి వందనం ద్వారా పిల్లలను పాఠశాలకు పంపే ప్రతి తల్లికి ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున ఎంత మందిని బడికి పంపిస్తే అంత మందికి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఇంటింటికీ సురక్ష మంచినీరు అందించడం జరుగుతుం దన్నారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా, భూపేష్‌ను ఎమ్మెల్యేగా గెలిపించడం ద్వారా పేదలకు ప్రయోజనం చేకూర తుందన్నారు. భూపేష్ ఎమ్మెల్యే హోదాలో నాయకుడిగా కాకుండా సేవకుడిగా ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తాడని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల బాధ్యులు మోహన్‌రెడ్డి, జనసేన జగదీష్, స్థానిక నాయ కులు బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, గోపాల్‌యాదవ్, వీరారెడ్డి, నాగిరెడ్డి, దస్త గిరిరెడ్డి, నాగరాజు యాదవ్, గూటం నాగేంద్ర, మల్లారెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, పామిడి సత్యం, రాజగోపాల 'రెడ్డి, సుబ్బరామిరెడ్డి, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికే టీడీపీ, జనసేన కలయిక

టిడిపి విన్నింగ్ - వైకాపా లూసింగ్: చమర్తి

విశాలాంధ్ర -రాజంపేట: అరాచక, విధ్వంసక వైకాపా పరిపాలన అంతమే లక్ష్యంగా టిడిపి - జనసేన ఉమ్మడి పార్టీలు కలిసి తాడేపల్లిగూడెంలో నిర్వహించిన తెలుగు - జన విజయకేతనం " జెండా " సభ విజయవంతమైందని, సరికొత్త చరిత్ర కు నాంది పలికిందన్నారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు దేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు. అంతేకాకుండా తాడేపల్లిగూడెం జెండా బహిరంగ సభను చూసి, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని,ఆంధ్ర రాష్ట్రానికి రాబోయే ఎన్నికల్లో అత్యంత కీలకమని, పరిపాలన చేతకాక మూర్ఖపు ఆలోచనలతో రాష్ట్రాన్ని అంధకారంలోకి తీసుకెళ్లారని చమర్తి జగన్ మోహన్ రాజు విమర్శించారు. అదేవిధంగా అమరావతి పునర్నిర్మాణానికి ప్రజలంతా సహకరించాలని, బడుగు బలహీన వర్గాల ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో టిడిపి - జనసేన ఉమ్మడి పార్టీల కలయికని, అధికారం కోసమో లేక వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసమో కలిసిన కలయిక కాదని కేవలం రాష్ట్ర భవిష్యత్తు కోసమే ఇరు పార్టీల కలయికని ఆయన తెలియజేశారు. టిడిపి హయాంలో అన్నా క్యాంటీన్లు తెరిచి నిరుపేదలకు 5 రూపా యలకు నిరుపేదల కు భోజనం పెట్టి వారి ఆకలి తీర్చితే, జగన్ రెడ్డి అధికారం చేపట్టాక అన్నా క్యాంటీన్ లను తొలగించి పేద వర్గాల కడుపుకొట్టాడు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీల దాడులకు తెగబడుతున్నారని, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య చేసి, మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. అంతేకాకుండా మాస్క్ అడిగిన పాపానికి దళిత వైద్యుడు సుధాకర్ నీ మానసికంగా హిం సించి చంపేశారని జగన్ మోహన్ రాజు విమర్శించారు. వైకాపా నాయకుల వేధింపులు భరించలేక అంతర్జాతీయ క్రికెట్ కెప్టెన్ హనుమ విహారి వైదొలిగారని, రాష్ట్ర అభివృద్ధికి టిడిపి-జనసేన ఉమ్మడి పార్టీలు కట్టుబడి ఉన్నాయని,వైకాపా లాగా ప్రజల సొమ్ము దోచుకోకుండా, సంక్షేమ పథకాలు అమలు చేసి సాగునీరు త్రాగునీరు అందించి రైతులకు అండగా నిలబడుతూ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని జగన మోహన్ రాజు హామీ ఇచ్చారు.

బలిజపల్లి గంగమ్మ తల్లిని దర్శించుకున్న బత్యాల

విశాలాంధ్ర -రాజంపేట: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు సిద్ధం కమ్మని హామీ ఇచ్చిన సందర్భంగా గురువారం రాజంపేట పట్టణంలోని బలిజపల్లి గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చి ఎన్నికలకు రంగం సిద్ధం చేసు కుం టూ ముందుకు వెళ్లనున్నారు. ఈ సంద ర్భంగా ఆ వార్డు టీడీపీ అధ్యక్షు డు, మాజీ కౌన్సిలర్ గుగిల్ల చంద్రమౌళి మ రియు గ్రామస్తులు శాలువా కప్పి పూల మాలతో ఘనంగా సత్కరించి అమ్మ వారి తీర్థప్రసాదాలు అందజేశా రు.

అన్నమాచార్యలో ఐఓటీ వర్క్ షాప్

విశాలాంధ్ర -రాజంపేట: బోయనపల్లి లోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలోని ఏఐడీఎస్ డిపార్టు మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేది నుంచి 28వ తేది బుధవారం వరకు వర్క్ షాప్ జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ వెల్లడిం చారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బికేసీ గణేష్ మాట్లాడుతూ ఐఓటీ స్మార్ట్ సెన్సార్లు, రిమోట్ మోనిటరింగ్, సమర్థ వంతమైన డేటా మార్పిడితో హోమ్ ఆటోమేషన్, ఈవీలు మరియు వాహన ట్రాకింగ్ ను మార్చుతుందన్నారు. అలా గే కళాశాల క్యాంపస్ లో డ్రోన్స్, రోబో టిక్ ప్రోగ్రామింగ్ ఐఓటీ ప్రారం భించబడిన కనెక్టవిటీ నుండి ప్రయోజ నం పొందుతాయన్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, సిఎస్ఈ విభాగా ధిపతి డాక్టర్ ఎం సుబ్బారావు, కార్యక్ర మ కో-ఆర్డినేటర్ బి వెంకటేష్ గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో కాంగ్రెస్ న్యాయసాధన సభ

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : 1వ తేదీ మార్చి, 2024, శు క్రవారం సాయం త్రం 4 గంటలకు తిరుపతిలోని తారక రామా స్టేడియం (ఎస్వీ యూనివర్సిటీ ఎదురుగా) నందు ప్రత్యేక హోదా - ఆంధ్రుల హక్కు నినాదంతో "న్యాయ సాధన సభ" జరుగుతుంది ఈ కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, జాతీయ, రాష్ట్ర నాయ కులు పాల్గొన్నారు. కావున ఈ కార్యక్ర మానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంస్థల నాయకులు, మహి ళా విభాగం నాయకురాలు అందరూ హాజరై సభను విజయవంతం చేయా లని గుండ్లకుంట శ్రీరాములు కోరారు.